PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 244 | విజయవాడ, శుక్రవారం 7 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 7 April 2023 | Rs

ఇంటి వద్దకే వైద్యం

- దేశానికి ఆదర్శంగా అమలు చేస్తాం
- పల్నాడు నుంచి 'ఫ్యామిలీ డాక్టర్ విధానం' ప్రారంభించిన సిఎం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటింటికీ పింఛన్లు అందించిన తరహాలోనే రోగుల ఇంటి వద్దకే వైద్య సేవలు అందించడం 'ఫ్యామిలీ డాక్టర్ విధానం' ముఖ్య ఉద్దేశమని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు మంత్రి విడదల రజని అధ్యక్షత వహించారు. సిఎం మాట్లాడుతూ.. 'ఫ్యామిలీ డాక్టర్ విధానం' దేశానికి ఆదర్శమని, దేశంలో ఎక్కడా ఇలాంటి విధానం లేదని త్వరలో ఇతర రాష్ట్రాల వారు కూడా తమను అనురిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ విధానం ద్వారా రోగి ఇంటి వద్దకే వైద్యులు, సిబ్బంది వచ్చి సేవలు అందిస్తారని తెలిపారు. నయం కాని రోగులను పిహెచ్‌సి, జిల్లా, జనరల్ ఆస్పత్రులకు పంపుతారని వివరించారు. మండలానికి రెండు పిహెచ్‌సిలు ఉన్నాయని ఒకొక్క పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులు ఉంటారని, వీరిలో ఒకరు గ్రామాలకు వెళ్తారని, మరొకరు పిహెచ్‌సిలో చికిత్సలు చేస్తారని తెలిపారు. ఎప్పుడు ఫోన్‌చేసినా వైద్యులు అందుబాటులో ఉంటారని చెప్పారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా గ్రామాల్లో ఉన్న రోగులకు స్పెషలిస్టు వైద్యులు సూచనలు, సలహాలు ఇస్తారని తెలిపారు. 48,639 మంది వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించామని, కొత్తగా 17 మెడికల్ కళాశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఈ విధానానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఏటా రూ.3300 కోట్లు ఖర్చు చేస్తున్నామని అన్నారు.



ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం బుక్‌లెట్ విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి జగన్

టిడిపి హయాంలో ఆస్పత్రులకు పెండింగ్ పెట్టిన రూ.800 కోట్ల బకాయిలు కూడా చెల్లించామని తెలిపారు. రూ.990 కోట్లు ఆరోగ్యశ్రీ ఆసరా పథకానికి కేటాయించామన్నారు. 3800 జబ్బులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు, శస్త్రచికిత్సలు అందిస్తున్నామని తెలిపారు.

ప్రజలతోనే పొత్తు

తాను ఏ పార్టీతోనే పొత్తు పెట్టుకోనని, ప్రజలతోనే పొత్తుపెట్టుకుంటామని సిఎం జగన్ అన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్ని పార్టీలతో అయినా పొత్తుపెట్టుకుంటారని విమర్శించారు. తనను ఒంటరిగా ఎదుర్కొలేక కొన్ని మీడియా సంస్థలతో పాటు పవన్ కల్యాణ్‌తో కలిసి ఎత్తులు, జిత్తులు, పొత్తులు, కుయుక్తులు పన్నుతుంటారని చంద్రబాబుపై ధ్వజమెత్తారు. వీరంతా సామాజిక న్యాయం తెలియని పరాన్నజీవులని వ్యాఖ్యానించారు. మంత్రి విడదల రజని ప్రసంగిస్తూ తన రాజకీయ భవిష్యత్తు జగన్ పెట్టిన భిక్ష అని కన్నీటి పర్యంతమయ్యారు. చంద్రబాబు హయంలో వైద్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, అంబటి రాంబాబు, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, జిల్లా కలెక్టర్ శివశంకర్, డిఐజి త్రివిక్రమ వర్మ, ఎస్‌పి రవిశంకర్ రెడ్డి, నర్సరావుపేట ఎంపి లావు కృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్-2 విఆర్‌ఒలకు ప్రమోషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-2ు రెవెన్యూ అధికారులకు పదోన్నతులకు అవకాశం కల్పించేలా ఇప్పటి వరకూ ఉన్న విఆర్‌ఒల సర్వీస్ రూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు సిసిఎల్‌ఎ జి సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన జిఓ ప్రకారం గ్రేడ్-2 విఆర్‌ఒలుగా రెండేళ్ల సర్వీసు ఉన్నవారికి ప్రమోషన్లు రానున్నాయి. దీనికోసం ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సర్వీస్ రూల్స్ 2008ను ప్రభుత్వం సవరించింది. ఇప్పటికే వున్న గ్రేడ్-1 విఆర్‌ఓ, గ్రేడ్-2 విఆర్‌ఒల సర్వీసులను గ్రామ, వార్డు సచివాలయాల్లో విఆర్‌ఓ వ్యవస్థకు అనుగుణంగా వుండేలా మార్పులు చేశారు. 2019 గ్రామ, వార్డు సచివాలయాలు తీసుకొచ్చిన సమయంలో 8,600 మందిని, గ్రేడ్-1లో ఉంచిన వారితోపాటు సచివాలయాల కోసం 2,800 మందిని తీసుకున్నారు. 2020లో విఆర్‌ఎ నుంచి విఆర్‌ఒలుగా 3,795 మందిని తీసుకున్నారు. సచివాలయ అవసరాల రీత్యా వీరికి గ్రేడ్-2 విఆర్‌ఒలుగా ఉద్యోగాలు ఇచ్చినప్పటికీ వారికి ప్రమోషన్లు ఇచ్చే అవకాశం కల్పించలేదు. దీనిపై వారందరూ ఎప్పటి నుండో ఆందోళన చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఒకే కేడర్లో సుదీర్ఘకాలం పనిచేయడం సాధ్యం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాలూ పెద్దఎత్తున నిరసనలు చేపట్టాయి. పలు విఆర్‌ఓ సంఘాలూ అధికారులు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించాయి. దీనిపై ప్రభుత్వం ఇటీవల సిసిఎల్‌ఎలో సమావేశం నిర్వహించింది. ఈ విషయాన్ని సిసిఎల్‌ఎ సాయిప్రసాద్ సిఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆలోచించిన ప్రభుత్వం గ్రేడ్-2 విఆర్‌ఒలకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. దీనిపై క్యాబినెట్లోనూ ఆమోదం వచ్చింది.



జాతీయ పతాకాలు చేత పట్టి భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రతిపక్షాల ఎంపీలు

అదానీపై దర్యాప్తునకు జంకెందుకు?

- మోడీ సర్కార్‌ను నిలదీసిన ప్రతిపక్షాలు
- పార్లమెంటు నుంచి విజయ్ చౌక్ వరకు మువ్వన్నెల జెండాలతో ర్యాలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ, విదేశాల్లో అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూపు సంస్థల అధినేత గౌతమ్ అదానీపై దర్యాప్తు జరిపించేందుకు భయమెందుకో చెప్పాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో నిలదీశాయి. బడ్జెట్ సమావేశాల ముగింపు రోజైన గురువారం నాడు మువ్వన్నెల జెండాలు చేత పట్టి ప్రతిపక్షాల ఎంపీలందరూ పార్లమెంటు నుంచి విజయ్ చౌక్ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. అదానీ అక్రమాలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి)తో దర్యాప్తు జరిపించాలని, కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపర్చి ప్రతిపక్షాల నాయకులపై కొనసాగిస్తున్న వేధింపులను విరమించుకోవాలని నినాదాలు చేశారు. ఈ తిరంగా మార్చ్‌ను పార్లమెంట్ గేట్ నంబర్ 1 వద్ద జాతీయ జెండా పట్టుకొని యుపిఎ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడండాలంటూ విపక్ష ఎంపీలు పెద్ద పెట్టున నినాదాలతో హోరెత్తించారు. విజయ్ చౌక్‌కు చేరుకున్న తిరంగా మార్చ్‌ను అక్కడ పోలీసులు అడ్డుకున్నారు. అదానీపై సమగ్ర విచారణకు జెపిసి వేయాలని, రాహుల్ గాంధీపై వేసిన అనర్హత వేటును వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సామాజిక కార్యకర్తలపైనా, ప్రతిపక్ష నాయకులపైనా ఐటి, ఇడి, సిబిఐలను ప్రయోగించి వేధింపులకు గురి చేయడాన్ని వెంటనే ఆపేయాలని డిమాండ్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, సిపిఎం, సిపిఐ, ఆర్‌జెడి, ఎస్‌పి, ఆప్, బిఆర్‌ఎస్, జెడియు, ఎన్‌సిపి, ఐయుఎంఎల్, ఆర్‌ఎస్‌పి, శివసేన (థాకరే), విసికె, నేషనల్ కాన్ఫరెన్స్, మిగతా 2లో

భారీగా ఐఎఎస్‌ల బదిలీలు

- 57మందికి స్థానచలనం
- 9 జిల్లాల కలెక్టర్ల మార్పు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం మరో ఏడాదిలో సాధారణ ఎన్నికలను ఎదుర్కోనున్న నేపథ్యంలో భారీగా ఐఎఎస్‌లను బదిలీలు చేపట్టింది. మొత్తం 57 మంది ఐఎఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం.. 9 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించింది. చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, బాపట్ల, కర్నూలు, కృష్ణా, సత్యసాయి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించింది. కార్మికశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి అనంతరామును మైనార్టీ వెల్ఫేర్‌శాఖకు బదిలీ చేసింది. వెయింటింగ్‌లో ఉన్న ఆర్‌పి సిసోడియాను ఎపి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంటు ఇన్‌స్టిట్యూట్‌కు డైరెక్టర్ జనరల్‌గా, జెన్‌కో ట్రాన్స్‌కో సిఎండి డి శ్రీధర్‌ను ఎపి కంట్రోల్ బోర్డు మెంబర్ సెక్రటరీగా, సౌరభ్‌గౌర్‌ను ఎపి భవన్‌కు ఆదిత్యనాథ్ స్థానంలో నియమించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరు కోన శశిధర్‌ను ఐటిఇ అండ్ సి శాఖకు సెక్రటరీగా నియమించారు. సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ కె హర్షవర్ధన్‌ను శాప్‌కు రెగ్యులర్ పోస్టింగు ఇచ్చారు. అలాగే ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనరు ఎంవి శేషగిరిని లేబర్ కమిషనరుగా నియమించారు. దేవాదాయశాఖ కమిషనరు ఎం హరిజవహర్‌లాల్‌ను లేబర్, ఫ్యాక్టరీస్, బాయిలర్స్ ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్‌కు సెక్రటరీగా నియమించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరు ప్రవీణ్‌కుమార్‌ను ఎపిఐఐసి ఎమ్‌డిగా, ఎపి స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఎమ్‌డి ఎస్ సత్యనారాయణను దేవాదాయశాఖ కమిషనరుగా, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరు పి బసంత్‌కుమార్‌ను ఎపి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డిగా నియమించారు.

విజయనగరం జిల్లా కలెక్టరు ఎ సూర్యకుమారిని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరుగా, కర్నూలు జిల్లా కలెక్టరు పి కోటేశ్వరరావును మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనరుగా, నెల్లూరు జిల్లా కలెక్టరు కెవిఎన్ చక్రధరబాబును ఎపి జెన్‌కో ఎమ్‌డిగా, చిత్తూరు జిల్లా కలెక్టరు ఎం హరినారాయణను నెల్లూరు జిల్లా కలెక్టరుగా, అనంతపురం జిల్లా కలెక్టరు ఎస్ నాగలక్ష్మిని విజయనగరం జిల్లా కలెక్టరుగా, వెయిటింగ్‌లో ఉన్న ఎస్ ప్రభాకరరెడ్డిని సిసిఎల్‌ఎ జాయింట్ సెక్రటరీగా, చిత్తూరు జిల్లా కలెక్టరుగా ఎస్‌ఎస్ మోహన్‌ను, ఇండస్ట్రీస్ డైరెక్టరు ఎస్ సృజనను కర్నూలు జిల్లా కలెక్టరుగా, బాపట్ల జిల్లా కలెక్టరు కె విజయను సోషల్ వెల్ఫేర్ డైరెక్టరుగా, కృష్ణా జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషాను బాపట్ల జిల్లా మిగతా 2లో

కేంద్ర ద్రోహానికి వ్యతిరేకంగా పోరు

- మతోన్మాదాన్ని నిలువరించాలి
- అన్ని పార్టీలూ ముందుకు రావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు
- 14న విజయవాడలో ప్రచారభేరి ప్రారంభం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయం, వివక్షపూరిత విధానాలు, ద్రోహానికి వ్యతిరేకంగా పోరాడాలని, మతోన్మాదాన్ని నిలువరించాలని, దీనికి వ్యతిరేకంగా అన్ని పార్టీలు ముందుకు రావాలని పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం పిలుపునిచ్చింది. ఈనెల 3, 4 తేదీల్లో విజయవాడలో పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. దీనికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, ఎం.ఎ.బేబి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిటీ తీసుకున్న నిర్ణయాలను పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం మీడియాకు విడుదల చేశారు.

ఐదారు నెలలుగా రాష్ట్రప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత మరింత పెరుగుతోంది. ఇది ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వ్యక్తమైంది. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పోలవరం, విశాఖ ఉక్కు వంటి విషయాల్లో ప్రభుత్వం కేంద్రంతో పోరాడకుండా లాలూచీ పడుతోంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఇంత చేస్తున్నా టిడిపి, జనసేన పార్టీలు బిజెపితో అవకాశవాద పొత్తుల కోసం అర్రులు చాస్తున్నాయి. జనసేన పార్టీ బిజెపి ఢిల్లీ పెద్దలతో ఇటీవల జరిపిన మంతనాలు రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమైనవి, దెబ్బతీసేవి. బిజెపి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేస్తుంటే, ప్రజలందరూ తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం చేసి, ఛీకొడుతుంటే జనసేన మాత్రం బిజెపిని వాటేసుకొని రాజకీయ పొత్తుపెట్టుకోవడమేగాదు, తెలుగుదేశాన్ని కూడా తీసుకువస్తానని, ముగ్గురం కలిసి పొత్తు పెట్టుకుంటామని చెప్పడమంటే రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టడమే. ఇప్పటికైనా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపి పట్ల తమ వైఖరి పునరాలోచించుకోవాలని సిపిఎం విజ్ఞప్తి చేసింది. బిజెపి ఆధ్వర్యంలోని కేంద్రప్రభుత్వంపై రాష్ట్ర ప్రయోజనాలకోసం పోరాటం చేయాలి కానీ రాజీపడటం ద్వారా కాదు. బిజెపిని కలుపుకుని పోవడం వైసిపికి ఉపయోగపడే చర్య అవుతుంది. రాష్ట్రానికి అన్ని రకాలుగా ద్రోహం చేసిన బిజెపితో ఎలా కలుస్తారో జనసేన ప్రజలకు వివరణ ఇవ్వాలి.

రాష్ట్రంలో తమ రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి వివిధ సందర్భాల్లో మత ఉద్రిక్తతలను రెచ్చగొడుతోంది. మతం ప్రజలకున్న వ్యక్తిగత స్వేచ్ఛ. ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిలు శ్రీరామనవమి సందర్భంగా శోభాయాత్రలు, వివిధ కార్యక్రమాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు, ఘర్షణలు పెంచుతున్నాయి. ప్రజల్లో అభద్రతాభావం సృష్టించే బిజెపి యత్నాలను తిప్పికొట్టాలని ప్రజలకు, పార్టీలకు, లౌకికవాదులకు సిపిఎం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది.

దురదృష్టవశాత్తు కొన్ని పార్టీలు మోడీకి కొమ్ముకాస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మోడీ విధానాలను అందరికంటే ముందుగా అమలు చేస్తోంది. విద్యుత్ ఛార్జీలు, చెత్తపన్ను, ఆస్తిపన్ను పెంచారు. విద్యా విధానం, పారిశ్రామిక విధానాలను అస్తవ్యస్తం చేశారు. అదానీ లాంటి వారికి కొమ్ముకాచి రాష్ట్ర సంపదను అప్పగిస్తున్నారు. వారికి రాయితీలిచ్చి ప్రజలపై భారాలను, రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులను ప్రజలపై నెట్టాలని చూస్తున్నారు. వ్యవసాయ రంగంలో మీటర్లు పెట్టి మెడమీద కత్తి వేలాడేలా చేసిందీ ప్రభుత్వం. బిజెపి రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వలేదు. విభజన హామీలు అమలు జరపలేదు. విశాఖ ఉక్కుప్రయివేటీకరణ ఆగలేదు. దాని ఉత్పత్తిని దెబ్బతీసి, ముడి సరుకు మిగతా 2లో

మే 20న గురుకుల విద్యా సంస్థల ప్రవేశ పరీక్ష


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా సంస్థల్లో వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశ పరీక్ష మే 20వ తేదీన జరగనుందని పరీక్షల కన్వీనరు జి పుష్పలత తెలిపారు. 5, 6, 7, 8 తరగతులకు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్షలు జరగనున్నాయని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రవేశ పరీక్ష మధ్యాహ్న 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఈ నెల 4 నుంచి 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని, ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.లక్షకు మించకూడదని, తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలని తెలిపారు. ఇంటర్‌లో సీటు పొందిన వారికి ఉచితంగా ఐఐటి, నీట్, సిఎ-సిపిటి లాంగ్ టర్మ్‌కోచింగ్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం aprs.apcfss.in వెబ్‌సైట్‌ను, సందేహల నివృత్తి కోసం 7673903887, 9866559646, 9989924974, 9701889874 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

తొలగించిన పాఠ్యాంశాలను పునరుద్ధరించండి

సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య పుస్తకాల ద్వారా చరిత్ర సిలబస్‌ను మార్చేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేసింది. సిలబస్‌ను క్రమబద్ధీకరించేందుకు, విద్యార్థులపై భారాన్ని తగ్గించేందుకే ఇలా చేశామని ఎన్‌సిఇఆర్‌టి చీఫ్ చేస్తున్న విచిత్రమైన వాదన పూర్తిగా తప్పుదారి పట్టించేదిగా పేర్కొంది. చరిత్రను మతోన్మాద ధోరణులతో తిరగరాయడానికి చేస్తున్న ప్రాజెక్టులో ఇది ఒక భాగమని పొలిట్‌బ్యూరో విమర్శించింది. కేవలం మతతత్వ అభిప్రాయ భేదాలను ప్రాతిపదికగా తీసుకుని వివిధ కాలాలకు సంబంధించిన మన గతాన్ని తొలగించలేమన్న అంశాన్ని ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా విస్మరిస్తోందని సిపిఎం తప్పుబట్టింది. మొఘల్ సామ్రాజ్యం గురించిన మొత్తం అధ్యాయాలను తొలగించడం ద్వారా చరిత్రను వక్రీకరించే మెజారిటీవాదుల ధోరణిని ఇది నొక్కి చెబుతోందని ఆ ప్రకటన పేర్కొంది. మహాత్మా గాంధీ హత్య, తదనంతరం ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించ డానికి దారి తీసిన



పరిస్థితులకు సంబంధించిన కీలకమైన పాఠ్య భాగాలను తొలగిం చాలని ప్రభుత్వం భావించిన తీరు చూస్తుంటే ఆర్‌ఎస్‌ఎస్ విచ్ఛిన్నకర, హింసాత్మక పాత్రను తుడిచిపెట్టే ఉద్దేశ్యంతోనే ఈ పాఠ్య పుస్తకాలను సవరించేందుకు ప్రస్తుత ప్రయత్నాలు చేపట్టినట్లు స్పష్టమవుతోందని పొలిట్‌బ్యూరో విశ్లేషించింది. హేయమైన ఈ చర్యలను తిప్పికొట్టడానికి, పాత పాఠ్య పుస్తకాలను పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మన గతాన్ని నిష్పక్షపాతంగా అధ్యయనం చేయడంలో ఆసక్తి కలిగిన దేశభక్తులందరూ తక్షణమే తమ నిరసన గళాన్ని వినిపించాలని సిపిఎం కోరింది.

వడ్డీ రేట్లు యథాతథం

- ఆర్‌బిఐ

ముంబయి : వరుసగా ఆరు సార్లు కీలక వడ్డీ రేట్లు పెంచిన భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) ఈసారి ఎలాంటి మార్పులు లేవని తెలిపింది. మూడు రోజుల పాటు ఇక్కడ జరిగిన ఆర్‌బిఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష గురువారంతో ముగిసింది. రెపోరేటును యథాతథంగా 6.5 శాతంగా కొనసాగించాలని నిర్ణయించింది. ఇంతక్రితం ఆరు సమీక్షల్లోనూ రెపోరేటును 250 బేసిస్ పాయింట్లు పెంచడంతో, రుణ గ్రహీతలపై భారం పడింది. 2023-24లో తొలి ద్రవ్య పరపతి విధాన సమీక్ష. భేటీ అనంతరం ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ మీడియాతో మాట్లాడారు. 2022-23లో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) ఏడు శాతం వుండొచ్చని, 2023-24 అంచనాలను 6.4 శాతం నుంచి 6.5 శాతానికి పెంచామని తెలిపారు. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో జిడిపి 7.8 శాతం పెరగొచ్చన్నారు. కొత్త ఏడాది 2023 ఆశాజనకంగా ప్రారంభమైంద ని, అనూహ్యంగా మార్చిలో బ్యాంకింగ్ సంక్షోభంతో అంతర్జాతీయ పరిస్థితులు క్లిష్టంగా మారాయని దాస్ చెప్పారు. ద్రవ్యోల్బ ణం కొంత అదుపులోకి వచ్చినప్పటికీ.. తమ లక్ష్యం కంటే ఎక్కువగానే ఉందన్నారు.



ఆర్థికశాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తదితరులు

డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను సచివాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ ఖాళీలను గుర్తించి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని, పాఠశాలలు తిరిగి తెరిచేనాటికి ప్రక్రియ పూర్తిచేయాలని లక్ష్మణరావు కోరారు. లక్షలాదిమంది నిరుద్యోగులు డిఎస్‌సి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను కూడా డిఎస్‌సిలో చేర్చాలని కోరారు. ఉపాధ్యాయ ఖాళీల వల్ల వెనుకబడిన ప్రాంతాల్లో విద్యార్థులు విద్యాపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

'గురుకుల' పదవీ విరమణ వయసు పెంచాలని విజ్ఞప్తి

గురుకులాల సిబ్బంది పదవీ విరమణ వయసు 62కు పెంచాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వర్లు కోరారు. ఈ మేరకు ఆర్థికశాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరిని సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గురుకులాల సిబ్బందికి, యూనివర్సిటీలలో నాన్ టీచింగ్, కార్పొరేషన్లు, సొసైటీలలో సిబ్బందికి ఇప్పటి వరకూ పదవీ విరమణ వయసు పెంచలేదని వివరించారు. అనేకమంది జీతాలు, పెన్షన్ లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. 2004 సెప్టెంబరు 1న సిపిఎస్ అమలుకు ముందు ఎంపికైన ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు సుమారు 10 వేలమంది ఉన్నారని తెలిపారు. వీరందరూ సిపిఎస్‌లో ఉన్నారని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో ప్రకారం ఒపిఎస్ అమలు చేయాలని కోరారు.

సిఎం గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ సందేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశమిచ్చారు. జీసస్‌ను శిలువ వేసిన గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ మానవాళి చరిత్రలో కీలకమైన రోజులని ఆయన పేర్కొన్నారు. ప్రేమ, సహనం విలువను ఈ ప్రపంచానికి తెలిపాయని వివరించారు.

ఆస్తి పన్ను ఒకేసారి చెల్లిస్తే 5% రాయితీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నులను ముందుస్తుగా ఈ నెల 30వ తేదీలోపు ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తామని మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కమిషనరు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆస్తిపన్ను, విఎల్‌టి (ఖాళీ స్థలం పన్ను), మంచినీటి కుళాయిలకు సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ రెండు అర్థ సంవత్సరాల పన్నుల డిమాండ్‌ను ఇప్పటికే అందుబాటులో వుంచామని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ కార్యాలయాలతోపాటు వార్డు సచివాలయాలు, ఆన్‌లైన్‌లో గానీ పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పండగ రోజుల్లో తరగతులు వద్దు

- ప్రైవేటు పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


పదో తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసిన పాఠశాలల్లో 1నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు టెన్త్ పరీక్షలు జరిగే ఆరు రోజులపాటు సెలవులుగా ప్రకటిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్. సురేష్‌కుమార్ గురువారం సవరణ ఉత్తర్వులు జారీ చేశారు. పది పరీక్షల కారణంగా నష్టపోతున్న ఆరు పనిదినాలను ఏప్రిల్ 30వ తేదీ చివరి పనిదినంలోపు ఇతర సెలవు దినాల్లో భర్తీ చేయాలని గతంలో ఉత్తర్వులు ఇచ్చామన్నారు. వివిధ జాతీయ పండుగలు, పర్వదినాలు, మత ప్రాముఖ్యత కలిగిన ప్రధాన రోజుల్లో ప్రైవేటు పాఠశాలలు ఎటువంటి తరగతులు నిర్వహించరాదని తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఆయా రోజుల్లో విద్యార్థులకు తరగతులను నిర్వహించినచో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామని సవరణ ఉత్తర్వులు జారీచేశారు.

భారీగా ఐఎఎస్‌ల బదిలీలు

మొదటి పేజీ తరువాయి

కలెక్టరుగా నియమించారు. మైనార్టీ వెల్ఫేర్ డైరెక్టరు జిసి కిశోర్ కుమార్‌ను జిఎడిలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. పి రాజాబాబును జివిఎంసి కమిషనరు నుంచి కృష్ణా జిల్లా కలెక్టరుగా, ఏలూరు జాయింట్ కలెక్టరు పి అరుణ్‌బాబును శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరుగా, ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరీ సిఇఒ ఎం గౌతమిని అనంతపురం జిల్లా కలెక్టరుగా, ఎంప్లాయిమెంటు అండ్ ట్రైనింగ్ డైరెక్టరు బి లావణ్యవేణిని ఏలూరు జాయింట్ కలెక్టరుగా, సివిల్ సప్లైస్ డైరెక్టరు ఎం విజయ సునీతను ఐసిడిఎస్ డైరెక్టరుగా, ఐసిడిఎస్ డైరెక్టరు ఎ సిరిని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరుగా, పశ్చిమగోదావరి జెసి జె వెంకటమురళీని ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టరుగా, కర్నూలు జిల్లా జెసి ఎస్ రామసుందర్‌రెడ్డిని పశ్చిమగోదావరి జెసిగా, కడప జెసి సిఎం సాయికాంత్ వర్మను జివిఎంసి కమిషనరుగా, అన్నమయ్య జిల్లా జెసి తమీం అన్సారియాను జిఎడిలో రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీ సి శ్రీధర్‌ను ప్రకాశం జిల్లా జెసిగా, చిత్తూరు జెసి ఎస్ వెంకటేశ్వర్‌ను ఎపి వివిపి కమిషనరుగా, వి వినోద్ కుమార్‌ను ఎపి స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఎమ్‌డిగా, సీతంపేట ఐటిడిఎ పిఒ బి నవ్యను ఎంప్లాయిమెంటు అండ్ ట్రైనింగ్‌కు డైరెక్టరుగా, ఎన్‌టిఆర్ జిల్లా జెసిగా పి సంపత్‌కుమార్‌ను, సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీ జి గణేష్ కుమార్‌ను కడప జెసిగా, ఒ ఆనంద్‌ను విశాఖపట్నం జాయింట్ కమిషనరుగా, పిఆర్అండ్ఆర్‌డి అడిషనల్ కమిషనరు మహేష్‌కుమార్ రావిరాలను కాకినాడ మున్సిపల్ కమిషనరుగా, పాడేరు ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ రోణంకిని సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్సు కమిషనరుగా తిరుపతి మున్సిపల్ కమిషనరు అనుపమ అంజలిని జిఎడిలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. తిరుపతి మున్సిపల్ కమిషనరుగా నారాపురెడ్డి మౌర్యను నియమించారు. కల్పనాకుమారిని సీతంపేట ఐటిడిఎ పిఒగా, ఎస్ఎస్ఎ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టరు బి శ్రీనివాసరావును ఎస్ఎస్ఎ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టరుగా వేస్తూ... అక్కడ పనిచేస్తున్న వెట్రిసెల్విని జిఎడిలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. కర్నూలు మున్సిపల్ కమిషనరు ఎ భార్గవతేజను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అడిషనల్ డైరెక్టరుగా, ఎపి భవన్ అడిషనల్ కమిషనరు హిమాన్షు కౌశిక్‌ను అన్నమయ్య జిల్లాకు జెసిగా, ఎపిపిఎఫ్‌సి ఎమ్‌డి, ఎనర్జీ డిపార్టుమెంటు డిప్యూటీ సెక్రటరీ పృథ్వీతేజ్ ఇమ్మడిని ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డిగా, అనకాపల్లి జెసిగా ఎం జాహ్నవిని నియమించారు. సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరీగా శ్రీవాస్ ముకూర్ అజయ్‌కుమార్‌ను నియమితులయ్యారు. పాడేరు సబ్ కలెక్టరు వి అభిషేక్‌ను పాడేరు ఐటిడిఎ పిఒగా, విఎస్అండ్‌డబ్ల్యుఎస్ అడిషనల్ డైరెక్టరు వికాష్‌మర్మత్‌ను కర్నూలు జెసిగా, పి శ్రీనివాసులును చిత్తూరు జెసిగా, ఫైనాన్స్‌శాఖ అభిషేక్ కిషోర్‌ను, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనరు ఎస్ సురేష్ కుమార్‌ను ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనరుగా, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎమ్‌డి జి వీరపాండియన్‌కు మార్క్‌ఫెడ్ ఎఫ్ఎసిగా అదనపు పోస్టింగ్ ఇచ్చారు.

సాగని సబ్‌ప్లాన్



- సగం కూడా నిధులివ్వని పరిస్థితి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అట్టడుగు వర్గాలను ఆదుకునేందుకు అమలు చేస్తున్న పథకాలకు నిధుల కొరత వేధిస్తోంది. బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేస్తున్నప్పటికీ, విడుదల, వ్యయానికి మాత్రం పొంతన కుదరడం లేదు. కేటాయింపులకు, వ్యయానికి మధ్య స్వల్ప తేడా ఉంటే అర్థం చేసుకోవచ్చు గానీ గత నాలుగేళ్లలో సగం మాత్రమే వ్యయం ఉండడం గమనార్హం.

ప్రధానంగా ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికల్లో కేటాయింపులకు, వ్యయానికి మధ్య భారీ అంతరాలు కనిపిస్తున్నాయి. ఇంతలా కేటాయింపులు ఉన్నప్పటికీ ఆ నిధులు ఏమయ్యాయన్నదే ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. కీలకమైన ఎస్‌సి ఉప ప్రణాళికకు నాలుగేళ్లలో ఏకంగా రూ.1,02,679 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. చివరిలో వీటికి అదనంగా మరో రూ.6,488 కోట్లు కేటాయించారు. మొత్తమ్మీద నాలుగేళ్లలో రూ.60,111 కోట్లు మాత్రమే వ్యయం చేయడం గమనార్హం. కేటాయింపులకు, వ్యయానికి మధ్య ఏకంగా రూ.42 వేల కోట్లకుపైగా తేడా ఉంది. ఎస్‌టి ఉప ప్రణాళిక నిధుల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఈ నాలుగేళ్లలో రూ.35,515 కోట్లు కేటాయింపులు చేయగా, వ్యయం మాత్రం రూ.18,891 కోట్లుగానే రికార్డయ్యింది. ఈ రంగంలోనూ రూ.16 వేల కోట్లకు పైగా తగ్గుదల కనిపించింది. వెనుకబడిన తరగతుల వారికోసం రూ.72,495 కోట్లు కేటాయించగా, రూ.66,196 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మైనార్టీ విభాగంలో రూ.9,908 కోట్లు కేటాయించగా, రూ.6,867 కోట్లే ఖర్చు చేయగలిగారు. కాపులకు చేసే సాయం విషయంలో కేటాయింపుల కన్నా వ్యయం ఎక్కువగా కనిపించింది. నాలుగేళ్లలో రూ.10,457 కోట్లు కేటాయించగా, రూ.909 కోట్లు అదనంగా వ్యయం చేయడం గమనార్హం.

ఇతర అవసరాలకు నిధులు

కేటాయింపుల కన్నా రూ.67 వేల కోట్ల వరకు తక్కువగా వ్యయం చేయగా, ఆ నిధులు ఇతర అవసరాలకు మళ్లించినట్లు అధికారులు అంగీకరిస్తున్నారు. ఉప ప్రణాళిక పేరున నిధులు కేటాయించడం, ఆ నిధులను ఇతర సంక్షేమ పథకాలకు వినియోగిస్తున్నట్లు తేలింది. అందుకే ఉప ప్రణాళికలకు అవసరమైన నిధుల కన్నా ఎక్కువ కేటాయింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది.

సబ్‌ప్లాన్ ద్వారా బడ్జెట్ కేటాయింపులు, వ్యయం (రూ.కోట్లలో)

రంగం	కేటాయింపులు	వ్యయం	అంతరం
ఎస్‌సి	1,02,679	60,111	42,568
ఎస్‌ట	35,515	18,891	16,624
కాపు	10,457	11,366	+909
బిసి	72,495	66,196	6,299
మైనార్టీ	9,908	6,867	3,041
మొత్తం	2,31,054	1,63,431	67,623

సలేశ్వరం జాతరలో విషాదం

- క్యూలో ఊపిరాడక ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సలేశ్వరం జాతరలో విషాదం చోటుచేసుకుంది. అధిక సంఖ్యలో జనం రావడంతో క్యూలో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఊపిరాడక మృతి చెందారు. సందర్శకులు తెలిపిన వివరాల మేరకు... నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ నల్లమల అడవుల్లో రెండో రోజు కొనసాగుతున్న సలేశ్వరం జాతరకు రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో జనం తరలివచ్చారు. గంటల తరబడి లింగమయ్య దర్శనం కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో వనపర్తి జిల్లా ప్రాంతానికి చెందిన చంద్రయ్య (55) గుండెపోటుతో మృతి చెందగా, వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన అభిషేక్ (32) ఊపిరాడక చనిపోయారు. మృతదేహాలను అతి కష్టం మీద కాడి పట్టుకుని పోలీసులు, అటవీశాఖ అధికారులు రాంపూర్‌పెంట వద్దకు చేర్చారు.

14న ఆర్ 5 జోన్ జిఓపై 'సుప్రీం'లో విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజధాని అమరావతిలో ఇతర ప్రాంతాల వారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్ 5 జోన్ జిఓపై ఈ నెల 14న సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది. ఆర్ 5 జోన్ జిఓను సవాల్ చేస్తూ అమరావతి రైతులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర హైకోర్టు ఆర్ 5 జోన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోవడంతోపాటు ఎటువంటి నిర్ణయం వెలువరించకపోవడంతో రైతులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. రైతుల పిటిషన్‌ను విచారణ చేపట్టాలంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ధర్మాసనం ఎదుట సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు గురువారం ప్రస్తావించారు. పిటిషన్‌ను వచ్చే సోమవారమే విచారణ చేపట్టాలని ధర్మాసనానికి ఆయన విజ్ఞప్తి చేశారు. 10న విచారణ జాబితా ఇప్పటికే సిద్ధమైనందున ఆ రోజు విచారణ చేపట్టలేమని సిజెఐ చెప్పగా పిటిషన్ తీవ్రత దృష్ట్యా త్వరగా విచారణ చేపట్టాలని న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ఈ నెల 14న విచారణ చేపడతామని సిజెఐ తెలిపారు.

జూన్‌లో దళిత రక్షణ యాత్ర

- డిఎస్‌ఎంఎం జాతీయ నాయకులు శ్రీనివాసరావు
- ప్రభుత్వ రంగ రక్షణకు పోరాటం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశంలో ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం, రిజర్వేషన్లను పరిరక్షించుకోవడం, సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం పోరాటం చేయడమే బాబూ జగ్జీవన్‌రామ్‌కు అర్పించే ఘన నివాళని డిఎస్‌ఎంఎం జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు అన్నారు. మాజీ ఉప ప్రధాని, కేంద్ర మాజీ మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దనున్న విగ్రహానికి డిఎస్‌ఎంఎం, కెవిపిఎస్ ఆధ్వర్యాన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు పూలమాల వేసిన అనంతరం మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య సమరయోధులు, సామాజిక ఉద్యమకారులు అని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రిజర్వేషన్లను పరిరక్షించడంలో వాటిని ప్రభుత్వ రంగ సంస్థల్లో అమలు చేయడం, పునరుద్ధరించడంలో ఆయన పాత్ర కీలకమైందని తెలిపారు. అప్పటి క్యాబినెట్లో విభజన వచ్చిన సమయంలో సంక్షేమ రాజ్యం కావాలని, ప్రైవేటు బ్యాంకుల్లో పేదలకు రుణాలివ్వడం లేదని, అందువల్ల వాటిని జాతీయం చేయాలని పోరాడారన్నారు. రిజర్వేషన్లు పరిరక్షించడం, సంక్షేమ కార్యక్రమాలను, భూపంపిణీ జరిగేలా చూడాలని ఆ దిశగా పోరాటాలు నిర్వహించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో దళితులపై తీవ్ర దాడి జరుగుతోందని తెలిపారు. కడపలో తమకు అనుకూలంగా లేరని అధికారి అచ్చెన్నను హత్య చేశారన్నారు. దీనిపై జ్యుడీషియల్ కమిషన్ వేసి న్యాయం చేయాలని కోరారు. దళితుల సమస్యలపై జూన్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా దళిత రక్షణ యాత్ర చేపడతామని తెలిపారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై దాడులు నిరంతరం జరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. దళిత జాగృతి సేన నాయకులు గణేష్ మాట్లాడుతూ.. దళితులపై దాడులకు వ్యతిరేకంగా కెవిపిఎస్ నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో పాలు పంచుకుంటామని తెలిపారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ తదితరులు మాట్లాడారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి నటరాజు వందన సమర్పణ చేశారు.

టిడిపి హయాంలోనే బిసిలకు న్యాయం

- యువగళం పాదయాత్రలో నారా లోకేష్



బిసిలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న లోకేష్

ప్రజాశక్తి- అనంపురం కలెక్టరేట్

బిసిలను ఉద్ధరిస్తానంటూ వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారిని నిలువునా దగా చేస్తున్నారని, వెనుకబడిన తరగతులకు టిడిపి హయాంలోనే న్యాయం జరిగిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్ర 62వ రోజు గురువారం సత్యసాయి జిల్లా కూడేరు నుంచి కమ్మూరు మీదుగా కోటంక, మర్తాడుకు చేరుకుంది. కమ్మూరులో బిసి సామాజిక తరగతుల ప్రతినిధులతో నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నేడు బిసిల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిలపై అక్రమ కేసులు బనాయించి భయాందోళనలకు గురిచేస్తోందని దుయ్యబట్టారు. బిసి విద్యార్థులకు స్కాలర్ షిప్స్ కూడా రావడం లేదని, విదేశీ విద్య పథకం కూడా ఆపేశారని విమర్శించారు. ఈడిగ సామాజిక తరగతులను ప్రభుత్వం వేధిస్తోందని ఆరోపించారు. బోయ తరగతులకు ఎటువంటి సాయం అందడం లేదన్నారు. పేరుకే కార్పొరేషన్‌లు ఉన్నాయని, ఒక్క రూపాయి రుణం ఇవ్వలేదని విమర్శించారు. విద్యా దీవెన, వసతి దీవెనకు సంబంధించిన నిధులు కొంత మంది తల్లిదండ్రుల ఖాతాలో పడటం లేదని ఆరోపించారు. టిడిపి ప్రభుత్వం రాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద చెల్లిస్తామని హామీనిచ్చారు. సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరిస్తామన్నారు. బిసి ఉప కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పాదయాత్రలో ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి : చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది క్రమబద్ధీకరణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి లేఖ రాశారు. సచివాలయ సిబ్బందికి అక్టోబరు 2021 నాటికి ప్రొబేషన్ పూర్తయిందని, 2022 జూన్ నుంచి రెగ్యులరైజ్ అయిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 అక్టోబరు నుంచి పేస్కేలు రెగ్యులరైజ్ చేస్తామని పేర్కొందని, అయితే ఆ బకాయిలు చెల్లించలేదని వివరించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు 40,000 మంది ఉద్యోగుల క్రమబద్ధీకరణ పెండింగ్‌లో ఉందని తెలిపారు. క్రమబద్ధీకరించిన వారికి పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, ఎపి గవర్నమెంటు లైఫ్ ఇన్సూరెన్స్, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీము, ఎంప్లాయీ హెల్త్ స్కీము కింద గ్రామ, వార్డు సెక్రటేరియట్ సిబ్బంది నుండి మినహాయించిన మొత్తాలను వెంటనే సంబంధిత ఖాతా హెడ్‌లలో జమచేయాలని కోరారు.

టచ్‌లో 40 మంది వైసిపి ఎమ్మెల్యేలు : కె అచ్చెన్నాయుడు

వైసిపి ఎమ్మెల్యేలు 40 మంది టిడిపికి టచ్‌లో ఉన్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. ఈ విషయంలో తాను అబద్ధాలు చెప్పడం లేదన్నారు. టిడిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టచ్‌లో ఉండడమే కాకుండా తమకే ఎదురు ఆఫర్లు ఇస్తున్నారని చెప్పారు. ఒక్కరికి సీటిస్తామనే హామీ ఇస్తే నలుగురు వస్తామంటూ వైసిపి ఎమ్మెల్యేలు ఫోన్లు చేస్తున్నారని చెప్పారు. వైసిపిలో ఉంటే తమకు భవిష్యత్తు ఉండదని ఆ పార్టీ నేతలకు అర్థమైందన్నారు. టచ్‌లో ఉన్న ఎమ్మెల్యేల జాబితా చెప్పాలని మంత్రి ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేయడం పిచ్చితనమే అని, పేర్లు ఎందుకు చెప్పాలని అన్నారు. వైసిపితోనే తమ జీవితమంటూ గంభీరంగా చెప్పే వాళ్లే తమ పార్టీలో చేరేందుకు ముందు వరుసలో ఉన్నారన్నారు. కాలు బెణికిందన్న సాకుతో ఒంటిమిట్ట వెళ్లని సిఎం జగన్ చిలకలూరిపేట పర్యటనకు ఎలా వెళ్లారని ప్రశ్నించారు.

సిబ్బంది, మందులు లేకుండానే ఫ్యామిలీ డాక్టర్ : ఆలపాటి

ప్రభుత్వాస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కల్పించలేని జగన్ ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ అనే కామెడీ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టిందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. ప్రభుత్వ వైద్యశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎలాంటి వసతులు, సౌకర్యాలు లేవని, తగినంత సిబ్బందిని నియమించలేదని అన్నారు. మందులు, ఇతర సామగ్రి అందించకుండా మెరుగైన వైద్యసేవలందిస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు.

వైసిపివి దింపుడుకళ్లం ఆశలు : వర్ల

'మా నమ్మకం నువ్వే జగన్' నినాదాలు రాష్ట్రమంతా మారుమోగాలని చెప్పడం దింపుడుకళ్లం ఆశలు అని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. జగనే తమ దరిద్రం అని ప్రజలంతా ముక్తకంఠంతో నినదిస్తుంటే సిఎం జగన్‌కు, వైసిపి ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డికి వినిపించడం లేదా అని ప్రశ్నించారు. పనిదినాలు తగ్గుతున్నాయన్న నెపంతో పబ్లిక్ హాలిడేస్‌లో పాఠశాలలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం ముమ్మాటికీ దుర్మార్గమని టిడిపి నేత ఎఎస్ రామకృష్ణ అన్నారు. ఉపాధ్యాయులపై సిఎం జగన్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. 22ఏ పరిధిలోని భూముల్ని ఏళ్ల నుంచి సాగుచేసుకుంటున్న వారికి కాకుండా వైసిపి వారికి కట్టబెట్టాలన్నదే ప్రభుత్వ దురాలోచన అని టిడిపి అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు విమర్శించారు.

కేంద్ర ద్రోహానికి వ్యతిరేకంగా పోరు

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వకుండా, జిందాల్ కంపెనీల ప్రతినిధులను తీసుకొచ్చి వారి ద్వారా ముడిసరుకు సప్లై చేయించి దొడ్డిదారిన ప్రయివేటీకరణ యత్నాలను చేస్తోంది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, ఇతర రాజకీయ పక్షాలు మాట్లాడడం లేదు. అన్ని పార్టీలు ముందుకొస్తే తప్ప విశాఖ ఉక్కును కాపాడుకోలేం. జాతీయ ప్రాజెక్టయిన పోలవరానికి నిధులివ్వలేదు. అక్కడ మునిగిపోతున్న నిర్వాసితులకు సహాయం చేయలేదు. కేంద్ర ప్రభుత్వం నుండి ఇన్ని వైఫల్యాలు కనిపించినా సరే రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు బిజెపి కేంద్ర ప్రభుత్వానికి కొమ్ముకాస్తున్నాయి. అంగన్‌వాడీల ఆందోళన జరగకుండా ఎక్కడికక్కడ అరెస్టులు, నోటీసులు, బెదిరింపులు చేసినా లెక్క చేయకుండా ఏడెనిమిది వేలమంది విజయవాడ చేరుకున్నారు. వారిలో మూడు నాలుగు వేల మందిని అరెస్టు చేశారు. ఆశాలు, కాంట్రాక్టు వర్కర్లు ఆందోళన చేస్తుంటే పిలిచి, చర్చించి సమస్యలు పరిష్కరించడానికి బదులుగా నిర్బంధం ద్వారా అణచివేయాలని చూడటం సహించరాని విషయం.

ధరలు పెరిగి రాష్ట్ర ప్రజలు నానాబాధలు పడుతుంటే ప్రభుత్వం నాలుగేళ్ల నుండి నవరత్నాలు గురించి చెప్పిందే చెబుతున్నది తప్ప రాష్ట్రాభివృద్ధి గురించి గానీ, ఉపాధి గురించిగానీ, నిరుద్యోగం గురించి గానీ మాట్లాడటం లేదు. పరిశ్రమలు రాలేదు. గ్లోబల్ సమ్మిట్ పేరుతో రాష్ట్రప్రభుత్వం హడావుడి చేసింది. పాత ఒప్పందాలనే మరలా చెప్పి నిరుద్యోగుల్లో భ్రమలు కల్పించడం తప్ప మరేమీ కాదు. విశాఖపట్నంలో జి 20 పేరుతో హడావుడి చేసినా ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొక్క బోర్లా పడింది. ముఖ్యమంత్రి నివాసం మార్పు, రాజధాని మార్పు అంటూ కబుర్లు చెప్పినా ఉత్తరాంధ్ర ప్రజలు వీరి బుట్టలో పడలేదు. ఓటమి తరువాతనైనా వైసిపి ప్రభుత్వం దారిమార్చుకొని ప్రజలు అభిప్రాయాలకనుగుణంగా నడుచుకుంటే మంచిది.

రాబోయే రోజుల్లో బిజెపి కార్పొరేట్ అనుకూల మతోన్మాద విధానాలపై పోరాడుతూనే రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సిపిఎం పిలుపునిచ్చింది. ప్రజలపై వేసే భారాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే అనేక సమస్యలపై పోరాటాలు చేస్తున్న కార్మిక సంఘాలు, యువజన, మహిళా, రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యమాలకు, భూ పోరాటాలకు మద్దతు ప్రకటించింది.

కేంద్ర బిజెపి ప్రభుత్వ దుర్మార్గ విధానాలపై సిపిఎం, సిపిఐ ఉమ్మడి ప్రచార భేరి నిర్వహిస్తాయి. బిజెపి ద్రోహానికి, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేయాలని నిర్ణయించింది. ఈ నెల 14న విజయవాడలో ఈ ప్రచారభేరి ప్రారంభించాలని, దీనికి ఉభయ పార్టీల కేంద్ర నాయకులు ప్రకాశ్‌కరత్, వినయ్ విశ్వం హాజరవుతారని, ఈ నెల 30 వరకు ఈ క్యాంపెయిన్ రాష్ట్రమంతా నిర్వహించాలని నిర్ణయించింది.

దేవుడు కూడా క్షమించడు

- తెలంగాణలో ప్రశ్నాపత్రాల లీక్‌పై మంత్రి బొత్స

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



పరీక్ష పత్రాల లీక్‌లకు పాల్పడటం నీచమైన పని, విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే వారిని దేవుడు కూడా క్షమించడని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. రాజకీయ కోణంలో ఇటువంటి వ్యవహారాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణా లో పదో తరగతి పరీక్ష పేపరు లీకేజీ వ్యవహారంపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు మంత్రి పై విధంగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో పది పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని, గత ఏడాది మాస్ కాపీయింగ్‌కు సహకరించిన వారిపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. విజయనగరంలోని ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌లో దండిమార్చ్ ఐకాన్ విగ్రహాలు ఆవిష్కరణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి చంద్రబాబు నాయుడు పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఐటీ కంపెనీలు, ఫార్మా కంపెనీలను విశాఖపట్నం ప్రాంతంలో ఏర్పాటు చేసింది, ప్రారంభించింది తమ హయాంలోనేన న్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది తమ ప్రభుత్వమేనని, టిడిపి హయాంలో చేసిందేమీ లేదని విమర్శించారు. రుషికొండలో ప్రభుత్వ భవనాల నిర్మాణం జరుగుతుందే తప్ప ఎవరి సొంత భవనాలు కాదని వివరించారు. టిడిపి మాదిరిగా దోపిడీదార్లు, దళారీ వ్యవస్థ తమ పార్టీలో లేదన్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని, రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పి తీరుతారని అన్నారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'పది' ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలంలో పదవ తరగతి తెలుగు ప్రశ్నా పత్రం లీకేజీ కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్, రూరల్ సిఐ నరేందర్‌రెడ్డి, ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. ఈ మేరకు వివరాలను గురువారం విలేకరుల సమావేశంలో వారు వెల్లడించారు. తెలుగు ప్రశ్నా పత్రం లీకేజీ కేసులో అంబవరానికి చెందిన మేకల గంగాధర్ అనే వ్యక్తిని అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించారు. విద్యుత్ ఆఫీస్‌లో లైన్‌ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్న రామిరెడ్డి ద్వారా జిరాక్స్ కాపీ వచ్చిందని, తన చెల్లెలి కోసం బి.మఠంలో ఉన్న జిరాక్స్ సెంటర్‌కు వెళ్లి జిరాక్స్ తీసుకుంటుండగా ఓ టివి విలేకరి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని విచారణలో వెల్లడించారు. గంగాధర్ ఇచ్చిన సమాచారం మేరకు రామిరెడ్డిని అదుపులో తీసుకొని విచారించగా తన కుమార్తె పదవ తరగతి పరీక్షలు రాస్తుండడంతో దీప్తి స్కూల్లో పనిచేసే హిందీ ఉపాధ్యాయుడు నుంచి తెలుగు ప్రశ్నా పత్రం జిరాక్స్ కాపీలను తీసుకున్నట్లు తెలిపారన్నారు. దీంతో ఆ పాఠశాలలోని ఫిజిక్స్ టీచర్ సుబ్రహ్మణ్యం, తెలుగు టీచర్ రామాంజనేయులు, హిందీ టీచర్ బాలరాజును విచారించగా బి.కోడూరు మండలం సగిలేరు గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు బాలచంద్రుడు ద్వారా తన సమీప బంధువు రామాంజనేయులు ఫోన్‌కు ప్రశ్నా పత్రాన్ని వాట్సాప్ ద్వారా పంపారని పేర్కొన్నారు. దీప్తి హైస్కూల్ కరస్పాండెటర్ రమణారెడ్డి సూచనల మేరకు ముగ్గురు టీచర్లు తెలుగు గైడ్‌లో నుంచి జవాబులను సేకరించి మైక్రో జిరాక్స్ కాపీలను తీసి వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారని తెలిపారు. దీప్తి హైస్కూల్‌లోని కంప్యూటర్, జిరాక్స్ మిషన్, మూడు కాపీ పత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మేకల గంగాధర్, గంగిరెడ్డి చిన్నరామిరెడ్డి, చిట్టిబోయిన బాలసుబ్రమణ్యం, వనిపెంట రామాంజనేయులు, సగిలి బాలరాజు, పొందిబోయిన చంద్రబాలుడును అరెస్టు చేశామని తెలిపారు.

'ఉక్కు' పరిరక్షణకు ఐక్య పోరాటం

- సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణే ధ్యేయంగా కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 784వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ సిఇసిసిపి విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునేందుకు కార్మికులు చేస్తున్న పోరాటం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ఇదే పోరాటాన్ని కొనసాగించాలని కోరారు. తమ వంతు సహాయ సహకారాలు నిరంతరం ఉంటాయని తెలిపారు. తొలుత దీక్షా శిబిరాన్ని సందర్శించిన సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, పోరాట కమిటీ చైర్మన్ ఎం రాజశేఖర్, కో - కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో పెద్ద ఎత్తున విశాఖ ఉక్కు ఉద్యోగులు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారన్నారు. పలు రాజకీయ పార్టీల మంత్రులను కలిసి మద్దతు కోరినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, వై.మస్తానప్ప పాల్గొన్నారు.

బిజెపి ఎమ్మెల్యే ఈటలకు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి ప్రశ్నపత్రం లీకేజీ కేసులో బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు వరంగల్ పోలీసులు నోటీసులు అందజేశారు. శామీర్‌పేటలోని ఈటల నివాసానికి గురువారం ఉదయం పోలీసులు వచ్చి 160 సిఆర్‌పిసి కింద నోటీసులిచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు వరంగల్ డిసిపి ఆఫీసులో విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. ఈటలతో పాటు ఆయన పిఎలు రాజు, నరేంద్రలకూ నోటీసులు ఇచ్చారు. పోలీసుల నుంచి తనకు నోటీసులు అందాయని, న్యాయవాదులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని ఈటల తెలిపారు. హిందీ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో కీలక నిందితుడు ప్రశాంత్... బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్‌తో పాటు ఈటల, ఆయన పిఎలకు క్వచన్‌పేపర్‌ను షేర్ చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో ముందస్తు ప్లాన్ ఉందని భావిస్తున్న పోలీసులు.. కేసు దర్యాప్తులో భాగంగా ఈటలకు నోటీసులిచ్చారు.

బండి సంజయ్‌కు బెయిల్

పదో తరగతి పేపరు లీకేజీ కేసులో అరెస్టై కరీంనగర్ జైలులో ఉన్న తెలంగాణ బిజెపి అధ్యక్షులు బండి సంజయ్‌కు హనుమకొండ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పోలీసుల విచారణకు సహకరించాలని, దేశం విడిచి వెళ్లరాదని కోర్టు ఆదేశించింది. రూ.20 వేల పూచీకత్తుతో ఇద్దరు వ్యక్తుల హామీ ఉండాలని బెయిల్ ఉత్తర్వుల్లో న్యాయమూర్తి పేర్కొన్నారు. గురువారం హనుమకొండ కోర్టులో సంజయ్ బెయిల్ పిటీషన్‌పై తవనిమిది గంటలపాటు సుదీర్ఘంగా వాదనలు కొనసాయి.

అదానీపై దర్యాప్తునకు జంకెందుకు?

(మొదటి పేజీ తరువాయి)


ఆర్ఎల్‌డి, జెఎంఎం, కేరళ కాంగ్రెస్, ఎండిఎంకె తదితర పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారు.

జెపిసి వేయాలంటే మోడీ సర్కార్‌కు భయం : ప్రతిపక్షాలు

తిరంగా మార్చ్ అనంతరం కానిస్టిట్యూషనల్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో పలువురు ప్రతిపక్షాల నాయకులు మాట్లాడారు. ప్రధాని మోడీ పేరుకే ప్రజాస్వామ్యమని అంటుంటారని, ఆచరణలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. అదానీ-హిండెన్‌బర్గ్ వ్యవహారంపై జెపిసి వేయడానికి భయమెందుకు? అని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ లేకుండానే.. 12 నిమిషాల్లోనే రూ. 50 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందనీ, పైగా ప్రతిపక్షాలు సహకరించడం లేదంటూ అబాండాలు మోపిందని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ప్రతినిధులే పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించారని ఆయన గుర్తు చేశారు. ప్రతిపక్షాలకు సభలో మాట్లాడేందుకు అనుమతించలేదని, తన 52 ఏళ్ల ప్రజాజీవితంలో ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు. ఈ సమావేశంలో టిఆర్ బాలు (డిఎంకె), సంజయ్ సింగ్ (ఆప్), కే.కేశవరావు (బిఆర్ఎస్), వి.శివదాసన్ (సిపిఎం), బినయ్ విశ్వం(సిపిఐ), మనోజ్ కుమార్ ఝా (ఆర్‌జెడి), ప్రసూన్ బెనర్జీ (టిఎంసి), కౌశలేంద్రకుమార్ (జెడియు), ఎస్.టి హసన్ (ఎస్‌పి), మహ్మద్ బషీర్ (ఐయుఎంఎల్), ప్రియాంక చతుర్వేది (శివసేన, ఠాక్రే), ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్‌పి), మహువా మాజి (జెఎంఎం), తిరుమావలవన్ (విసికె) తదితరులు పాల్గొన్నారు.

ఇంధన సామర్థ్య చర్యలు వేగవంతం

- కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ స్కీంకు పూర్తి మద్దతు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్ని ప్రభుత్వ శాఖలు, భవనాల్లో ఇంధన సామర్థ్య చర్యలను వేగవంతంగా అమలు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. పట్టణ పరిపాలన, పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్య, దేవాదాయ, పరిశ్రమల, సాంఘిక సంక్షేమ, పాఠశాల విద్య, వ్యవసాయ తదితర శాఖల్లో వీటిని అమలు చేయాలని చెప్పారు. ఎపి ఇంధన సంరక్షణ సమితి (ఎపిఎస్ఇసిఎం) 11వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం సచివాలయంలో గురువారం జరిగింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ స్కీంకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మద్దతు ఇస్తున్నట్లు సిఎస్ వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ఖర్చుతో అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించేందుకు, ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను ఎగుమతి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ప్రోత్సాహానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్ర విద్యుత్ డిమాండ్‌లో 17 వేల మిలియన్ యూనిట్లు (ఎంయు) విద్యుత్ చేసే అవకాశం ఉందన్నారు. ఇందులో కనీసం 10 శాతం విద్యుత్‌ను ఆదా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఇప్పటి వరకు చేపట్టిన ఇంధన సామర్థ్య ప్రాజెక్టుల పురోగతిని సిఎస్‌కు వివరించారు. రాష్ట్ర ఇంధన సామర్థ్య పాలసీని ప్రభుత్వానికి సమర్పించే ముందు అభిప్రాయాలు, సూచనల కోసం వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు. 70 హైటెన్షన్ విద్యుత్ స్టేషన్లలో పాత ఉపపరికరాల స్థానంలో ఇంధన సామర్థ్య ఉప పరికరాలను ఎపిఎస్ఇసిఎం భర్తీ చేసిందని ట్రాన్స్‌కో సిఎండి బి శ్రీధర్ వివరించారు. రెసిడెన్షియల్ భవనాల్లో ఇంధన సామర్థ్య చర్యలను వేగంగా అమలు చేసేందుకు ఎకోనివాస్ (ఇఎన్ఎస్) సంహితను పాటించాలని ఎపిఎస్ఇసిఎం సిఇఒ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్కమ్‌ల సిఎండిలు పద్మజనార్ధనరెడ్డి, కె సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూముల్లో గ్రానైట్ నిక్షేపాలను కాజేస్తున్నారు

- టిడిపి నేత ధూళిపాళ్ల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దళితులకు చెందిన భూముల్లో ఉన్న గ్రానైట్ నిక్షేపాలను సిఎం కుటుంబ సభ్యులే కాజేశారని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. గుంటూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం యడవల్లి, మురికిపూడి గ్రామాల్లో దళితులకు చెందిన భూములను 1975లో అప్పటి కలెక్టర్ ఏకపట్టా కింద సాగు చేసుకునేందుకు ఇచ్చారని తెలిపారు. వాటిని టిడిపి నేతలు కాజేస్తున్నారని ఎన్నికల ముందు చిలకలూరిపేట సభలో చెప్పిన జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మాటమార్చి ఆ భూములను ఎంపి అవినాష్‌రెడ్డి, ఆయన మామ, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రోద్భలంతో కాజేశారని తెలిపారు. ఇందుకు మంత్రి రజనీ కూడా సహకరించారని విమర్శించారు. రూ.25 కోట్ల విలువైన భూములకు రూ.7 లక్షలు ఇచ్చి దళితుల నుంచి బలవంతంగా లాక్కుని గ్రానైట్ నిక్షేపాలను అవినాష్ రెడ్డి కుటుంబ సభ్యులు తవ్వుకుంటున్నారని విమర్శించారు. 200 ఎకరాల్లో రూ.4,800 కోట్ల గ్రానైట్‌ను కొల్లగొడుతున్నారని తెలిపారు. భూసేకరణ చట్టం అమలు చేసినా ఒక్కో రైతుకు ఎకరాకు కోటి రూపాయలకుపైగా వచ్చేదని అన్నారు. దళితులను మైనింగ్‌లో భాగస్వామ్యం చేస్తే వారి జీవితాలు బాగుపడేవని తెలిపారు.



వైభవంగా కోదండరాముని రథోత్సవం

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట కోదండరామస్వామివారి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజున రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన రథోత్సవం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. భజన బృందాల చెక్కభజనలు, కోలాటాల నడుమ యాత్రికులు రథాన్ని లాగారు. అడుగడుగునా యాత్రికులు కర్పూర నీరాజనాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, ఇంజనీరింగ్ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'వాకపల్లి' మహిళలకు పరిహారం

దర్యాప్తు సక్రమంగా జరపని అధికారులపై చర్యలు
కేసు కొట్టివేత : ఎస్‌సి, ఎస్‌టి స్పెషల్ కోర్టు తీర్పు



ప్రజాశక్తి - లీగల్ విలేకరి (విశాఖపట్నం)

వాకపల్లి మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసుల అత్యాచారం కేసులో బాధిత మహిళలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నష్టపరిహారం చెల్లించాలని విశాఖపట్నంలోని ఎస్‌సి, ఎస్‌టి కేసుల విచారణ ప్రత్యేక జిల్లా న్యాయమూర్తి శ్రీధర్ తీర్పునిచ్చారు. సక్రమంగా దర్యాప్తు జరపని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసులు నిందితులుగా ఉన్న ఈ కేసులో పోలీసులతోనే దర్యాప్తు చేయించడం వల్ల వాకపల్లి మహిళలకు న్యాయం జరగలేదని న్యాయమూర్తి తీర్పులో అభిప్రాయపడ్డారు. ఈ కేసును కొట్టివేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఆ కేసుకు సంబంధించి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుంకర రాజేంద్రప్రసాద్ ఇచ్చిన సమాచారం ప్రకారం.. 2007 ఆగస్టు 21న విశాఖ జిల్లా పాడేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వాకపల్లి గ్రామంలో కొంతమంది గ్రేహౌండ్స్ పోలీసులు స్థానిక గిరిజన మహిళలపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో ఆ కేసు విచారణ సరిగా సాగలేదు. ఈ కేసులో ప్రజా సంఘాల సహాయంతో ఒకానొక సమయంలో సుప్రీంకోర్టును కూడా బాధిత మహిళలు ఆశ్రయించాల్సి వచ్చింది. పోలీసులు నిందితులుగా ఉన్న ఈ కేసును పోలీసులతో దర్యాప్తు చేయించడంపై అప్పట్లో పలు విమర్శలు వెల్లువెత్తాయి. అనేక మలుపులు తిరిగిన ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సుంకర రాజేంద్రప్రసాద్‌ను నియమించారు. ఆయన సాక్షులను విచారించారు. సిబిసిఐడి పోలీసులు ఈ కేసులో సక్రమమైన పద్ధతిలో దర్యాప్తు జరపలేదని తేలింది. అందువల్లే ఈ కేసులో నిందితులు శిక్ష నుండి తప్పించుకున్నారని, దర్యాప్తు సక్రమంగా జరపని అధికారులైన శివధర్‌రెడ్డి, ఆనంద్‌రావులపై తగిన చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తి ఆదేశించారు. 2007 నుంచి బాధిత మహిళలు పడుతున్న క్షోభ వర్ణనాతీతమన్నారు. వారికి ప్రభుత్వం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.



65 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలోని శ్రీలక్ష్మీ గణపతి రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారులు గురువారం ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 1370 క్వింటాళ్ల ధాన్యం సీజ్ చేశారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ విల్సన్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. శ్రీలక్ష్మీ గణపతి రైస్ మిల్లును మోక్షా ట్రేడర్స్ నిర్వాహకులు యలమర్తి సత్యకిరణ్ అద్దెకు తీసుకుని నిర్వహిస్తున్నారు.

రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వానికి సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో అనధికారికంగా రేషన్ బియ్యం, ధాన్యం సేకరిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో అధికారులు సోదాలు నిర్వహించి 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. నిర్వాహకులు యలమర్తి సత్యకిరణ్, క్లర్క్ అర్.సునీల్, రేషన్ బియ్యం వ్యాన్ ద్వారా సరఫరా చేస్తున్న తంగెళ్ల శివరాజుపై కేసు నమోదు చేశారు. రేషన్ బియ్యంతోపాటు మిల్లులో నిల్వ చేసిన రూ.35,49,900 విలువైన 1370 క్వింటాళ్ల ధాన్యం, వ్యాన్‌ను కూడా సీజ్ చేశామని సిఐ తెలిపారు.

'జగనన్నే మా భవిష్యత్తు'లో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తాం : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా గత ప్రభుత్వానికి, తమ ప్రభుత్వానికి తేడా చెప్పాలని ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. మొత్తం 7 లక్షల మంది గృహసారథులు రాష్ట్రంలోని కోటి 60 లక్షల కుటుంబాలకు చెందిన ఇళ్లకు వెళ్లి మాట్లాడనున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మెసేజ్‌ను వారికి అందిస్తారని తెలిపారు. ఐదు ప్రశ్నలను ప్రజల ముందు ఉంచుతామని చెప్పారు. ఆ తర్వాత వారికి ముఖ్యమంత్రి సందేశాన్ని అందించడంతోపాటు వారి అనుమతితో ఇంటిముందు స్టిక్కర్‌ను వేస్తామని తెలిపారు. సెల్‌ఫోన్‌కు అతికించేలా చిన్న స్టిక్కర్‌ను అందజేస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో జన్మభూమి కమిటీ జలగలు ప్రజల్ని పీడిస్తే.. ఇప్పుడు లంచాలు లేకుండా అర్హతే ప్రమాణంగా వాలంటీర్ల వ్యవస్థ సంక్షేమం అందిస్తోందని చెప్పారు.

ప్రభుత్వ వాహనాలకు కొత్త రిజిస్ట్రేషన్ సిరీస్ నెంబరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ వాహనాల రిజిస్ట్రేషన్‌కు కొత్త నెంబరు సిరీస్‌ను కేటాయించారు. ప్రభుత్వ వాహనాలకు కొత్త రిజిస్ట్రేషన్ నెంబరు సిరీస్‌ను తీసుకొస్తూ రాష్ట్ర రవాణాశాఖ ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇకపై ప్రభుత్వ వాహనాలకు ఎపి 40జి అనే సిరీస్‌ను ఇచ్చేందుకు వీలుగా మోటారు వాహనాల చట్టంలో సవరణ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. నూతనంగా ప్రభుత్వం కొనుగోలు చేసే వాహనాలకు ఇకపై ఈ సిరీస్‌తోనే నెంబర్లను కేటాయించనున్నారు. వివిధ అవసరాల రీత్యా ప్రభుత్వం కొనుగోలు చేసే వాహనాలకు మాత్రమే ఎపి 40జి సిరీస్‌ను ఇవ్వనున్నట్లు నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొంది. 2018 చివరి నుంచి ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలకు రవాణాశాఖ 39 సిరీస్ కింద నెంబర్లను ఇస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలను వేరు చేసేలా ఇకపై ఈ కొత్త సిరీస్‌ను తీసుకొచ్చారు. దీనిపై అభ్యంతరాలు, సూచనలు, సలహాలను కోరుతున్నట్లు నోటిఫికేషన్‌లో రవాణాశాఖ పేర్కొంది.

పోలవరం ఎత్తుపై జనసేన దుష్ప్రచారం

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ఎత్తును 41.15 మీటర్లకే పరిమితం చేస్తున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహనతో సంతకాలు చేశాయని జనసేన దుష్ప్రచారం చేస్తోందని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఎత్తు తగ్గిస్తున్నట్లు సంతకాలు ఎక్కడ చేశామో చూపాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరంపై పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్ అజ్ఞానంతో బాధ్యతారాహిత్యంగా ఇష్టానుసారం మాట్లాడటం తగదన్నారు. పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు అస్తవ్యస్తం చేశారని, అందుకే ఆలస్యం అవుతోందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే ప్రసక్తే లేదని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో స్పష్టం చేశారని అన్నారు. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ పనులను చేస్తున్నామని, వీలైనంత త్వరగా పోలవరాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.

విలీనం సరే...'ఉపాధి'ఎక్కడ..?

- 'కార్పొరేషన్'తో కూలీల కష్టాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో శెట్టిపల్లి పంచాయతీలోని ఐదు గ్రామాలను కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం పది రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఇప్పటికే వేలాదిమందికి సంబంధించిన శెట్టిపల్లి భూముల 'ల్యాండ్ పూలింగ్' సమస్య దశాబ్దాలుగా అపరిష్కృతంగానే ఉంది. దీనికితోడు తిరుపతిలో విలీనం కావడంలో ఉపాధి హామీ పనులూ లేకుండా పోయాయి. ఉపాధి హామీనే నమ్ముకుని జీవిస్తున్న ఐదు గ్రామాల్లోని 320 మంది కూలీలు పనులు కోల్పోవడమే కాదు, 'ఉపాధి' పనులే ఇక లేవని పంచాయతీ అధికారులు చెప్పడంతో లబోదిబోమంటున్నారు. ఇదేమని అడిగితే పట్టణాల్లో ఉపాధి హామీ పనులు ఉండవని ఉపాధి హామీ సిబ్బంది తేల్చేశారు.

తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం శెట్టిపల్లి పంచాయతీలో మొత్తం 11 గ్రామాలు ఉన్నాయి. చంద్రగిరి, తిరుపతి శాసనసభ్యుల సొంత భూములకు 'విలువ' పెంచుకోవడం కోసమే విలీనం చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పది రోజుల క్రితం శెట్టిపల్లి పంచాయతీలోని శెట్టిపల్లి, శెట్టిపల్లి దళితవాడ, సిఆర్ఎస్, వినాయకనగర్ సాగర్, ఉప్పరపాలెం గ్రామాలను తిరుపతి కార్పొరేషన్‌లో విలీనం చేసినట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి వెల్లడించారు. అప్పటివరకూ పంచాయతీ పరిధిలో పన్నులు కట్టుకుంటున్న గ్రామస్తులు, ఇక నగర పరిధిలో పెద్దమొత్తంలో పన్నులు కట్టాల్సి వస్తుందన్న ఆందోళన ఆ గ్రామస్తుల్లో కనిపిస్తోంది. ఈ ఐదు గ్రామాలను పరిశీలిస్తే ఉపాధి హామీ జాబ్‌కార్డులు పొందినవారు 500 పైగా ఉన్నారు. వారిలో నిత్యం పనులకు వెళుతూ 320 మంది ఉన్నారు. రోజుకు 300 రూపాయలు సంపాదించుకునేవారు. ఎక్కువమంది పాడి పరిశ్రమపై ఆధారపడిన వారే ఈ ఉపాధి పనుల్లో ఉన్నారు. ప్రస్తుతం ఐదు గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయడంతో వారు రోడ్డున పడినట్లయ్యింది.

నగరాల్లో ఉపాధి హామీ అమలు చేయాలి : టి.సుబ్రమణ్యం, సిపిఎం



గ్రామాల్లో ఏ విధంగా ఉపాధి హామీ పనులు అమలు చేస్తున్నారో అదే విధంగా నగరాల్లోనూ అమలు చేయాలి. ఏడాదిన్నర క్రితం తిరుపతి రూరల్‌లో ఉన్న ఏడు పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. వారికీ ఉపాధి హామీ పనులు లేకుండా పోయాయి. ప్రస్తుతం శెట్టిపల్లి పరిధిలోని ఐదు గ్రామాలను తాజాగా విలీనం చేశారు. వారందరికీ తాత్కాలికంగానైనా కార్పొరేషన్‌లో కూలి పనులు కల్పించాలి.

ఉపాధి పని లేకుండా పోయింది
కె.చంద్రయ్య, శెట్టిపల్లి



పట్టణంలో పెయింటింగ్ పని చేసుకుంటూ దినసరి కూలీగా బతికేవాన్ని. వయస్సు సహకరించకపోవడంతో ఉపాధి హామీ పనులతో రోజుకు 250-300 రూపాయలు సంపాదించుకునే వాన్ని. వంద రోజులు పని కావాలని కోరుకుంటే, విలీనంతో అసలు పనే లేకుండా పోయింది.

మా పిల్లల చదువు ఎలా సాగుతుంది?
ఎ.రాజేశ్వరి, శెట్టిపల్లి



ఉదయం కరువు పనులకు పోయి మధ్యాహ్నం కల్లా ఇంటికొచ్చి, పిల్లలకు వంట చేసి చదివించుకునేవాళ్లం. మధ్యాహ్నం నుంచి పశువులు మేపుకుని సాయంత్రం పాలు పిండి కుటుంబాన్ని పోషించుకునేవాళ్లం.

బ్యాంకింగ్ వ్యవస్థ మరింత గందరగోళం

రఘురాం రాజన్ వెల్లడి



వాషింగ్టన్ : బ్యాంకింగ్ వ్యవస్థలో మరింత గందరగోళం నెలకొనే అవకాశాలున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. ఇటీవల సిలికాన్ వ్యాలీ బ్యాంక్, క్రెడిట్ సూస్సె దివాళా నేపథ్యంలో రాజన్ తాజాగా హెచ్చరించారు. 2009 నాటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ సంక్షోభాన్ని ఆయన ముందుగానే అంచనా వేశారు. తాజాగా గ్లాస్గోలో రాజన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నేను మంచే జరగాలని కోరుకుంటున్నాను. కానీ.. కొన్ని అనుకోని సవాళ్లు ఎదురు కావొచ్చు. సులభ నగదు, దీర్ఘకాలం అధిక లభ్యత వల్ల కొన్ని పరిణామాలు కఠినంగా మారొచ్చు. క్రెడిట్ సుస్సెలోని సమస్యలు ఆర్థిక వ్యవస్థలో అంతర్లీన సమస్యలను సూచిస్తున్నాయి." అని పేర్కొన్నారు. ప్రస్తుతం చికాగో యూనివర్సిటీ బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న రాజన్ 2013 నుండి 2016 వరకు ఆర్‌బిఐ గవర్నర్‌గా పని చేశారు.



ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తాం

మెలోరా సిఇఒ సరోజా యెర్రమిల్లి

హైదరాబాద్ : తేలికపాటి పసిడి అభరణాలను విక్రయించే మెలోరా తమ స్టోర్లను ద్వితీయ శ్రేణీ నగరాలకు విస్తరిస్తామని వెల్లడించింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన నూతన స్టోర్‌ను గురువారం ఆ సంస్థ ఫౌండర్, సిఇఒ సరోజా యెర్రమిల్లి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సరోజా మీడియాతో మాట్లాడుతూ.. ఇది తెలంగాణలో తమకు తొలి అవుట్‌లెట్ అని తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 24 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఉన్నాయన్నారు. వచ్చే ఐదేళ్లలో ఫ్రాంచైజీ పద్ధతిలో 500 స్టోర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ఏడాదిలోనే ఆంధ్రప్రదేశ్ లోని పలు నగరాల్లో స్టోర్లను అందుబాటులోకి తేనున్నామన్నారు. హైదరాబాద్‌లో ఐదు స్టోర్లకు పెంచుకోవాలని నిర్దేశించుకున్నామన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23లో రూ.700 కోట్ల టర్నోవర్ సాధించామన్నారు. గడిచిన నాలుగేళ్లలో సగటున 170 శాతం వృద్ధిని నమోదు చేశామన్నారు. బెంగళూర్‌లో తమకు తయారీ కేంద్రం ఉందన్నారు.



శెట్టిపల్లి భూములను పరిశీలిస్తున్న కె.నారాయణ

ధైర్యంగా ఇళ్లు నిర్మించుకోండి

- శెట్టిపల్లి భూబాధితులకు వామపక్షాల భరోసా

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

దశాబ్దాల కాలంగా సొంతింటి కలను నెరవేర్చుకోవడానికి దాదాపు 3,500 మంది పేదలు కష్టించి సంపాదించుకున్న సొమ్ముతో తిరుపతి రూరల్ మండలం శెట్టిపల్లి గ్రామంలో ప్లాట్లు కొనుక్కొని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, అయితే ఇళ్ల నిర్మాణం చేయకూడదని ప్రభుత్వం అడ్డు చెప్పడం, పరిష్కారం చూపకపోవడం దారుణమని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. శెట్టిపల్లి స్థలాలను సిపిఎం, సిపిఐ నేతలతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. శెట్టిపల్లి భూ బాధితులు ఎవరికి భయపడాల్సిన అవసరంలేదని, తాము ముందుండి ఇళ్ల నిర్మాణాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తిరుపతి రూరల్‌లో ఉన్న శెట్టిపల్లి ప్రాంతాన్ని నగరపాలక సంస్థలో విలీనం చేశారని, రూరల్‌లో ఉంటే ఒక నాయకుడి పెత్తనం, అర్బన్‌లో ఉంటే మరొక నాయకుడు పెత్తనం చేస్తున్నారని విమర్శించారు. పేదలు కొనుక్కున్న స్థలాలను దోచుకోవాలని కొందరు రాజకీయ నాయకులు చూస్తుంటే వారికి ప్రభుత్వం అండగా నిలబడడం సరికాదన్నారు. శెట్టిపల్లి భూముల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథ రెడ్డి, రామానాయుడు, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, శెట్టిపల్లి భూ బాధితుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో వడగండ్ల వాన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉపరితల ద్రోణి ప్రభావంతో హైదరాబాద్ నగరంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్, నల్లకుంట, అంబర్‌పేటతోపాటు సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో వడగండ్ల వాన పడింది. పంజాగుట్ట ఏరియాలో భారీ వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గురువారం ఉదయం నుంచి ఎండలు దంచికొట్టగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఆకాశం మేఘావృతం అయింది. అనంతరం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా మలక్‌పేట్, విఎస్‌టితోపాటు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరోవైపు నగరంలో హనుమాన్ శోభాయాత్రలు జరుగుతుండగా.. కొన్ని ప్రాంతాల్లో వానతో ఆటంకం కలిగింది. కాగా, పలు జిల్లాల్లోనూ వడగండ్లు పడ్డాయి.

మూడ్రోజులపాటు వర్షం

రాష్ట్రంలో మరో మూడ్రోజులపాటు ఉరుములు, మెరుపులతోపాటు గంటకు 40 నుంచి 50 వేగంతో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి తదితర ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది.

పాన్ ఆధార్ లింక్‌కు జరిమానా సరైందే

మంత్రి సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ : పాన్ కార్డుతో ఆధార్ అనుసంధానం చేయడంలో జాప్యానికి విధిస్తున్న జరిమానా సరైందేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రూ.1000 జరిమానాతో వీటిని లింక్ చేసుకోవడానికి జూన్ నెలాఖరు వరకు సిబిడిటి గడువును పొడిగించిన విషయం తెలిసిందే. ఈ మొత్తాన్ని జరిమానా విధించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. పాన్‌తో ఆధార్ లింక్‌నకు చాలా సమయం ఇచ్చామన్నారు. ఇప్పటికే ప్రక్రియను పూర్తి చేసుకొని ఉండాల్సిందన్నారు. ఇప్పటి వరకు చేయని వారు ఇకనైనా అనుసంధానం చేసుకోవాలన్నారు. గడువులోగా పాన్-ఆధార్ అనుసంధానం చేయకపోతే పాన్‌కార్డుతో ఎలాంటి లావాదేవీలు చేసేందుకు అవకాశం ఉండదని మంత్రి హెచ్చరించారు. ఐటి రిటర్న్ ఫైల్ చేయడానికి, సరి చేసుకోవడానికి వీలుండదన్నారు.

సంపాదకీయం

జేజేలు!


దేశంలో సాగుతున్న కార్పొరేట్‌- మతతత్వ కూటమి పాలన అంతం కావాలని, 'మోడీ గద్దె దిగు' అంటూ లక్షలాదిమంది కష్టజీవులు మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా ఢిల్లీ నడిబొడ్డున నినదించడం అభినందనీయం. ఆసేతు శీతాచలం నుండి హస్తినకు తరలివచ్చిన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఒక్క మాటలో చెప్పాలంటే ఈ దేశ సంపద సృష్టికర్తలు బుధవారంనాడు ఒకే వేదికపైకి వచ్చి ఒక్కటై హోరెత్తించారు. కాలికి చెప్పులు లేకుండా అనేక మంది ర్యాలీలో పాల్గొనడం, మహిళలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావడం ఎంతో స్ఫూర్తిదాయకం. దేశ నలు మూలలనుండి వచ్చిన కష్టజీవులు ఆయా ప్రాంతాలు, రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించే ఆహార్యంతో పాల్గొనడం 'భిన్నత్వంలో ఏకత్వాన్ని' కళ్లకు కట్టింది. శ్రామిక ప్రజలపైన వారి జీవనోపాధులపైన, హక్కులపైన మోడీ సర్కారు చేస్తున్న దాడికి వ్యతిరేకంగా పోరాడటంతోపాటు ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి, ఈ దేశాన్ని లౌకిక గణతంత్ర రాజ్యంగా పరిరక్షించడానికి సాగుతున్న మహోద్యమంలో ఈ ర్యాలీ ఓ ఉజ్వల ఘట్టం. రాం లీలా మైదానంలో సిఐటియు, ఎఐకెఎస్‌, ఎఐఎడబ్ల్యుయు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన చారిత్రాత్మక మజ్దూర్‌ కిసాన్‌ సంఘర్ష్‌ మార్చ్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ, వారికి అన్ని విధాలా సహకరించిన వారందరికీ జేజేలు!.

దేశంలో నయా ఉదారవాద పాలన కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలపై సాగించిన తీవ్ర దాడి ఫలితంగా గత రెండు దశాబ్దాలుగా మూడు లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రస్తుత బిజెపి ప్రభుత్వ హయాంలో ఈ దాడి మరింత తీవ్రమైంది. మోడీ ప్రభుత్వం లేబర్‌ కోడ్‌లు, రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలతో ఈ దాడిని సంస్థాగతీకరించడానికి ప్రయత్నించింది. రైతుల సుదీర్ఘ వీరోచిత ప్రతిఘటనతో వెనక్కి తగ్గినా అది తన ఉద్దేశాన్ని వదులుకోలేదు. వ్యవసాయ కార్మికులు, సామాన్య రైతాంగానికి ఉపాధి లభించడం లేదు. ఆహార ధాన్యాల సాగు నుండి రైతులను దూరం చేయడంతో దేశ ఆహార భద్రత దెబ్బ తింటోంది. పేదలకు ఇచ్చే సబ్సిడీల రద్దు, వారికి మేలుచేసే పథకాలకు బడ్జెట్‌ కేటాయింపుల్లో కోత విధిస్తున్నారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు సకల కుట్రలు చేస్తున్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన మోడీ, తొమ్మిదేళ్లలో 18 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా ఆ హామీని పూర్తిగా గాలికొదిలేశారు. యువతీయువకులకు ఉపాధి కల్పించని మోడీ సర్కారు గోరక్షక్‌ పేరుతో రెచ్చిపోతున్న మూకలకు మాత్రం ఉద్యోగాలిచ్చి విద్వేషాలు, విధ్వంసం సృష్టిస్తోంది.

కరోనా సమయంలో లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి వేల మైళ్లు కాలినడకన స్వగ్రామాలకు పోయి బికారులుగా మారిన పరిస్థితిరాగా మరోవైపు అదానీ, అంబానీ వంటి కుబేరుల ఆస్తులు అనేక రెట్లు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌ ధనికులకు పన్ను రాయితీలు ఇస్తోంది. ఆశ్రిత పెట్టుబడి దేశ సంపదను ఆమూలాగ్రం దోచుకు తింటోంది. ప్రజల సంపదయైన ప్రభుత్వరంగ సంస్థలను సర్కారు ధారాదత్తం చేస్తోంది. నాలుగు లేబర్‌ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోంది. ఇన్ని దారుణాలకు తెగబడుతున్న ప్రభుత్వాన్ని ఎవరైనా విమర్శిస్తే వారిని భయభ్రాంతులకు గురిచేయడం, ప్రతిపక్ష రాజకీయాల పార్టీలను అంతమొందించడానికి ప్రయత్నించడం ఘోరం. ప్రజల మధ్య విద్వేషాల సృష్టికి యత్నించడం దుర్మార్గం.

మోడీ సర్కారు దుర్విధానాలకు వ్యతిరేకంగా మజ్దూర్‌ కిసాన్‌ సంఘర్ష్‌ మార్చ్‌ జాతీయ స్థాయిలో జరిగింది. ఇలాంటి ర్యాలీలు, ప్రతిఘటనా పోరాటాలు క్షేత్ర స్థాయిలో కూడా జరగాలి. దేశ భవిష్యత్తు కోసం మార్పు అవసరం, అనివార్యం. కార్పొరేట్‌-మతతత్వ కూటమి పాలనకు వ్యతిరేకంగా కార్మిక కర్షక లోకం మరింతగా ఉద్యమించాలి. విశాల ఐక్య పోరాటాలను నిర్మించాలి. ఐక్య పోరాటాలతోనే భూసేకరణ ఆర్డినెన్స్‌ను ఆపడం, మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయించడం సాధ్యమైందన్న విషయం సదా గుర్తుంచుకోవాలి. పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చేసే చట్ట సాధన, లేబర్‌ కోడ్‌ల రద్దు, విద్యుత్‌ చట్ట సవరణల ఉపసంహరణ వంటి డిమాండ్లపై భవిష్యత్‌ ఉద్యమాలు, పోరాటాలకు అదే స్ఫూర్తి.

మహనీయుల మాట



శ్రమ చేసేవారు,
శ్రమ దోపిడీకి గురయ్యేవారు
ఎప్పటికీ పేదలుగానే వుంటారు.
స్వేచ్ఛా మార్కెట్‌లో కార్మికులు
ఎప్పటికీ స్వేచ్ఛను పొందలేరు.

- ఫ్రెడరిక్‌ ఏంగెల్స్‌



రామనవమి పేరుతో మత హింస!

వ్యాఖ్య

మార్చి 30న శ్రీరామనవమిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో హింస, ఘర్షణలు చెలరేగడమనేది అందరూ ముందుగానే ఊహించినది, చెబుతూ వస్తున్నదే. ఇన్నేళ్ళలో, హిందూత్వ శక్తులు రామనవమి ఉత్సవాలను, ప్రదర్శనలను ముస్లింలపై దురాక్రమణ, దాడులకు ఒక సాధనంగా మార్చేశాయి. గతేడాది రామనవమి ప్రదర్శనలు మధ్యప్రదేశ్‌ లోని ఖర్గాన్‌లో, మహారాష్ట్ర, గుజరాత్‌, గోవా, జార్ఖండ్‌, హౌరా లోని శివ్‌పూర్‌ ఏరియాల్లో విచ్చలవిడిగా దాడులు, ఘర్షణలకు దారితీశాయి. ఈ ఏడాది కూడా, రంజాన్‌ సమయంలోనే వచ్చిన రామనవమి... మసీదుల్లో రంజాన్‌ ప్రార్థనలు చేసే ప్రాంతాల్లో కవ్వింపు చర్యలకు దారి తీసింది.

మార్చి 30, ఆ తర్వాత రోజుల్లో, జలగావ్‌, మలద్‌, ఔరంగాబాద్‌ (ఇప్పుడు దీని పేరు శంభాజీ నగర్‌)ల్లో హింస, దాడులు చోటు చేసుకున్నాయి. ఔరంగాబాద్‌లో ఒకరు మరణించారు కూడా. బీహార్‌ లోని ససరాం, బీహార్‌ షరీఫ్‌లో తీవ్ర స్థాయిలో హింస చెలరేగింది. హర్యానాలో, గుజరాత్‌ లోని వడోదరలో కూడా ఇలాంటి సంఘటనలే చోటు చేసుకున్నాయి. పశ్చిమ బెంగాల్‌ లోని హౌరాలో రామనవమి ప్రదర్శన సందర్భంగా హింస చెలరేగింది. తర్వాత హుగ్లీ జిల్లాలోని రిషరాలో ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

బిజెపి పాలిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్‌తో పాటు పశ్చిమ బెంగాల్‌, బీహార్‌లో కూడా రామనవమి ఉత్సవాల సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్‌ మద్దతు కలిగిన సంస్థలు పశ్చిమ బెంగాల్‌లో రామనవమి ప్రదర్శనలను ఉపయోగించుకుని ముస్లిం ప్రాంతాల్లోకి వెళ్ళడం, మసీదుల వెలుపల కవ్వింపు చర్యలకు పూనుకోవడం, పెద్ద పెద్ద శబ్దాలతో పాటలు పెట్టడం, రెచ్చగొట్టే నినాదాలు ఇవ్వడం, కత్తులు ఇతర ఆయుధాలను ప్రదర్శించడం వంటి చర్యలకు పాల్పడ్డాయి. ఫలితంగా హౌరా, దల్ఖోలా ప్రాంతాల్లో హింస చెలరేగింది. ఒక వ్యక్తి మరణించగా, పలువురు గాయపడ్డారు.



> ప్రస్తుత పరిస్థితుల్లో కూడా మైనారిటీలలో పెరుగుతున్న భయాందోళనలను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి తృణమూల్‌ కాంగ్రెస్‌ ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో విభజన రాజకీయాలను కొనసాగించడంలో ఇరు పక్షాలకు ఆసక్తి వుండడంతో...మత విభజనను, ఘర్షణలను సృష్టించడానికి చేసే ప్రయత్నాల్లో బిజెపి, తృణమూల్‌ కాంగ్రెస్‌లు పరస్పరం సహకరించుకుంటున్నాయి. ముఖ్యంగా తృణమూల్‌ కాంగ్రెస్‌ అవినీతి పాలనకు వ్యతిరేకంగా సిపిఎం, వామపక్ష సంఘటనలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో, ఆ ప్రచారం ప్రజల్లో పట్టు సాధిస్తున్న తరుణంలో ఈ పరిస్థితి ఎదురైంది.

హౌరాలో రామనవమి ప్రదర్శన దారి మళ్ళకుండా నివారించడానికి అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను పోలీసులు, పాలనా యంత్రాంగం తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కొన్ని చోట్ల, పోలీసులు సంఘటనా ప్రాంతాల నుండి పారిపోయారు. మరికొన్ని చోట్ల పోలీసులు కూడా అల్లరి మూకల దాడుల్లో చేతులు కలిపారు. హిందూత్వ శక్తుల ఎత్తుగడలకు, వారి ఆలోచనలకు అడ్డుకట్ట వేయడానికి అవసరమైన గట్టి చర్యలను తీసుకోనందుకుగాను మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని తప్పుపట్టాల్సి వుంది. తమను ముందుగా ఎవరూ హెచ్చరించలేదనడం సరికాదు. గతేడాది కూడా హౌరా లోని శివ్‌పూర్‌లో ఘర్షణలు చెలరేగాయి. అంతకు ముందు సంవత్సరాల్లోనూ మత ఉద్రిక్తతలను, ఘర్షణలను సృష్టించడానికి ఆర్‌ఎస్‌ఎస్‌-బిజెపిలు రామనవమి ఉత్సవాలను ఉపయోగించుకునేవి. వారి మతోన్మాద ఎజెండాను ఎదుర్కొనడానికి బదులుగా రామనవమి రోజున తృణమూల్‌ కాంగ్రెస్‌ అటువంటి ప్రదర్శనల్లో పాల్గొనడమో లేదా ప్రదర్శనలను నిర్వహించడమో చేసేది. ప్రస్తుత పరిస్థితుల్లో కూడా, మైనారిటీలలో పెరుగుతున్న భయాందోళనలను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి తృణమూల్‌ కాంగ్రెస్‌ ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో విభజన రాజకీయాలను కొనసాగించడంలో ఇరు పక్షాలకు ఆసక్తి వుండడంతో...మత విభజనను, ఘర్షణలను సృష్టించడానికి చేసే ప్రయత్నాల్లో బిజెపి, తృణమూల్‌ కాంగ్రెస్‌లు పరస్పరం సహకరించుకుంటున్నాయి. ముఖ్యంగా తృణమూల్‌ కాంగ్రెస్‌ అవినీతి పాలనకు వ్యతిరేకంగా సిపిఎం, వామపక్ష సంఘటనలు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో, ఆ ప్రచారం ప్రజల్లో పట్టు సాధిస్తున్న తరుణంలో ఈ పరిస్థితి ఎదురైంది.

బీహార్‌ లోని బీహార్‌ షరీఫ్‌, ససరామ్‌ ప్రాంతాలలో అత్యంత అధ్వాన్నమైన రీతిలో హింసాకాండ చోటుచేసుకుంది. మసీదులు, మదరసాలు, ఇళ్ళు, వాహనాలు, దుకాణాలను లూటీ చేశారు. వాటికి నిప్పంటించారు. అత్యంత పురాతనమైన విద్యా సంస్థల్లో ఒకటైన మదరసా అజీజియాపై దాడి చేసి, ధ్వంసం చేయడం అన్నింటి కంటే దిగ్భ్రాంతికర సంఘటన. అందులోని అత్యంత అరుదైన ప్రతులతో పాటు, 4500 పుస్తకాలన్నింటినీ ధ్వంసం చేసి, నిప్పంటించారు.

బీహార్‌లో నితీష్‌ కుమార్‌ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. హిందుత్వ శక్తుల నీచమైన ఎజెండాను ఎదుర్కొనడానికి అవసరమైనంత నిఘా పెట్టలేదు. అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోలేదు. అయితే నితీష్‌ కుమార్‌, జె.డి(యు) మహాఘట్‌బంధన్‌కు తిరిగి వచ్చినప్పటి నుండి బిజెపి ఏకాకిగా మారింది. రామనవమి రోజున చెలరేగిన తాజా హింసను చూస్తుంటే...తమ రాజకీయ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకుగాను మతపరమైన చీలికలు సృష్టించాలన్న ఎత్తుగడను బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్‌లు రూపొందించాయని తెలుస్తోంది. గొడ్డు మాంసాన్ని తీసుకెళుతున్నాడన్న ఆరోపణలపై సరన్‌లో ముస్లిం యువకుడిని ఇటీవల కొట్టి చంపడాన్ని ముందస్తు హెచ్చరికగా చెప్పుకోవచ్చు. ఏవిధమైన మతోన్మాద కవ్వింపు చర్యలు తలెత్తకుండా నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పాలనా యంత్రాంగం అప్రమత్తంగా వుండాలి. పశ్చిమ బెంగాల్‌లో మాదిరిగా కాకుండా...మతోన్మాద భావజాలాన్ని, మతోన్మాద శక్తులను ఎదుర్కొనడంలో మహాఘట్‌బంధన్‌ అత్యంత దృఢంగా వుంది. నిర్దిష్టమైన చర్యల ద్వారా ప్రభుత్వం దీనిని నిరూపించుకోవాల్సి వుంది.

ఇక్కడ కేంద్రం దారుణమైన పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తోంది. హోం మంత్రి అమిత్‌ షా మత ఉద్రిక్తతల గురించి ఆ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడకుండా...గవర్నర్లతో చర్చించారు. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల మీద స్వారీ చేసేలా గవర్నర్ల పాత్ర వుండాలని కేంద్రం భావిస్తోందనడానికి ఇదొక సంకేతం. పైగా, అమిత్‌ షా బీహార్‌లో పర్యటిస్తూ...రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే ఇలాంటి మతోన్మాద ఘర్షణలు చెలరేగవని చెప్పారు. అల్లర్లకు పాల్పడేవారిని తలకిందులుగా వేలాడదీస్తామని ప్రకటించారు. అంటే ఇక్కడ అల్లర్లకు పాల్పడేవారు ముస్లింలని, వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తామనే సందేశం ఇచ్చారు. రామనవమి, గణేష్‌ చతుర్థి, హనుమాన్‌ జయంతి వంటి మతపరమైన పండుగలన్నీ కూడా మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడానికి, మత హింసను, చీలికలను సృష్టించడానికి ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారు. దూకుడుతోకూడిన మతోన్మాద సమీకరణలను రాజకీయంగా, పాలనాపరంగా ఎదుర్కొనేందుకు ప్రజాస్వామ్య, లౌకికశక్తులు ముఖ్యంగా బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యూహాన్ని రూపొందించాలి.

('పీపుల్స్‌ డెమోక్రసీ' సంపాదకీయం)

సందర్భం

అందరికీ ఆరోగ్యం

నేడు అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవం

అందరికీ ఆరోగ్యం అందని ద్రాక్ష చందంగా ఉన్నది. మన దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగానికి బడ్జెట్‌లో నిధులు తగినంతగా కేటాయించడం లేదు. ఓట్లు దండుకోవడం కోసం ఏవో కొన్ని పథకాలు ప్రవేశపెడుతున్నారు. అరకొర నిధులతో ప్రభుత్వం వైద్య రంగాన్ని విస్మరించటంతో కార్పోరేట్‌ వైద్యమే శరణ్యం అవుతోంది. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య ఖర్చులు భరించలేక అప్పుల్లో కూరుకుపోతున్నారు. దేశం ఈ స్థితి నుంచి బైటపడాలంటే...పాలకులు చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాల్సి వుంది. అందుకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని సరైన సందర్భంగా భావించవచ్చు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు.హెచ్‌.ఓ) 1948 ఏప్రిల్‌ 7వ తేదీన ఆరోగ్య దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది. డబ్ల్యు.హెచ్‌.ఓ లో సభ్యత్వం కలిగిన సుమారు 150 దేశాలు అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం ఆరోగ్య దినోత్సవం జరుపుకుంటున్నాయి. అయితే, ప్రపంచ ఆరోగ్య సంస్థ చేపట్టే అన్ని కార్యక్రమాల అమలు అభివృద్ధి చెందిన దేశాలు అందించే ఆర్థిక సహాయంపై ఆధారపడి వుంటుంది. కరోనా వేళ ప్రపంచ ఆరోగ్య సంస్థపై అసంతృప్తిగా ఉన్న అమెరికా నిధులు సరిగ్గా ఇవ్వకపోవడంతో డబ్ల్యు.హెచ్‌.ఓ కార్యక్రమాలు మందగించాయి. దాంతో అనేక ఆఫ్రికా, వెనుక బడిన దేశాలకు ఆరోగ్య సేవలు, టీకాలు అందక ఇబ్బంది పడుతున్నాయి. ఐక్యరాజ్యసమితి రూపొందించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా 2030 నాటికి అందరికీ ఆరోగ్యం లక్ష్యాన్ని అందిపుచ్చుకుని కదలాలి. అందులో భాగంగానే ఈ సంవత్సరం "అందరికీ ఆరోగ్యం" అనే థీమ్‌తో ప్రపంచం ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక వైద్యుడు (1:1000) ఉండాలి. అయితే మన దేశంలో ప్రతి 1511 మందికి ఒక వైద్యుడు (1:1500) ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా నార్వే, స్వీడన్‌ వంటి దేశాల్లో ప్రతీ వెయ్యి మందికి నలుగురికి పైబడి డాక్టర్లు ఉంటే... మన దేశంలో కేరళ, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, గోవా వంటి రాష్ట్రాల్లో నలుగురు డాక్టర్లు మించి ఉండటం శుభపరిణామం. అయితే దేశవ్యాప్తంగా చూస్తే సాధారణ వైద్యులతోపాటు వివిధ రోగ నిపుణులు, సర్జన్లు, సదుపాయాలు, బడ్జెట్‌ కేటాయింపులు, ఆసు పత్రులు, వైద్య కళాశాలల కొరత వెంటాడుతున్నది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం వైద్య రంగానికి అతి తక్కువ నిధులు కేటాయిస్తున్నది. కేంద్ర బడ్జెట్‌లో... ఆరోగ్యానికి దేశ జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా... కేవలం 2.1 శాతం మాత్రమే కేటాయించటం గమనార్హం. పైగా వైద్యుల కొరత కూడా వుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య, ఆరోగ్య రంగాలకు కేటాయింపులు పెంచుతూ వైద్యుల కొరతను అధిగమించే పనిలో పడాలి.


- ఐ. ప్రసాదరావు,
సెల్‌ : 6305682733

రెండు డిగ్రీల అసలు కతేంటి : నోరు విప్పరేం?

విమర్శ



ఎం. కోటేశ్వరరావు



నరేంద్ర మోడీ రెండు డిగ్రీల వివాదం గురించి మీడియాలో, రాజకీయ నేతల ప్రకటనల్లో చర్చ జరుగుతోంది. అసలు వివాదం ఏమిటి? నరేంద్ర మోడీ చిన్నతనంలోనే టీ అమ్ముతూ తండ్రికి తోడ్పడినట్లు చెప్పారు గనుక చదువుకోలేదు. అనేక మంది కాలేజీకి వెళ్లకుండానే దూర విద్య ద్వారా పరీక్షలు రాసి డిగ్రీలు పొందారు. వారిలో తాను ఒకరిని అని మోడీ చెప్పారు. ఢిల్లీ సి.ఎం అరవింద్‌ కేజ్రీవాల్‌కు నరేంద్ర మోడీ ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించిన డిగ్రీల మీద అనుమానం వచ్చింది. అదేమీ నేరం కాదు. సమాచార హక్కు చట్టం కింద మోడీ గారు ఢిల్లీ, గుజరాత్‌ విశ్వవిద్యాలయాల నుంచి పొందిన డిగ్రీలకు సంబంధించి ఏ రోల్‌ నంబరు, ఏ సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిందీ వివరాలు కావాలని అడిగారు. కేంద్ర సమాచార కమిషన్‌ దానికి స్పందించి ఆ వివరాలు సమర్పించాలని ప్రధాని కార్యాలయాన్ని కోరింది. తద్వారా జనాలకు వాటి గురించి తెలుసుకోవటానికి సాయపడుతుందని కూడా పేర్కొన్నది. కేజ్రీవాల్‌ మాదిరే అనేక మంది సమాచార హక్కు చట్టం కింద ఈ వివరాలు అడిగితే ప్రధాని కార్యాలయం, విశ్వవిద్యాలయాలు కూడా తిరస్కరించాయి. నరేంద్ర మోడీ డిగ్రీలు దేశ రక్షణకు సంబంధించిన అంశాలు కనుక వాటిని వెల్లడించకూడదని చెప్పి ఉంటే అసలు గొడవే ఉండేది కాదు. అలాంటి అంశాలకు సమాచార హక్కు చట్టం వర్తించదు. తన ఎన్నికల అఫిడవిట్‌లో నరేంద్ర మోడీ తాను దూరవిద్య ద్వారా 1978లో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ, గుజరాత్‌ విశ్వవిద్యాలయం నుంచి 1983లో ఎం.ఎ పట్టా పొందినట్లు పేర్కొన్నారు. కనుక అవి దేశ రహస్యాలు కాదు.

ఫలానా పదవికి ఫలానా విద్యార్హత ఉండాలని రాజ్యాంగం, ప్రజా ప్రాతినిధ్య చట్టంలో గానీ నిర్దేశించలేదు కదా మరి మోడీ డిగ్రీల గురించి ఇంత రచ్చ ఎందుకు అని సందేహం రావచ్చు. నాది వానాకాలం చదువు అని మోడీ రాసి ఉంటే గొడవ ఉండకపోను. తప్పుడు సమాచారమిచ్చారన్నదే ఆరోపణ. డిగ్రీ ఉంటే చూపాలి, లేకుంటే ఓటర్లను తప్పుదారి పట్టించినట్లు గనుక అది అనర్హత కిందికి వస్తుంది. మోడీ గుజరాత్‌ అసెంబ్లీకి పోటీ చేసినపుడు తాను అవివాహితుడనని అఫిడవిట్లలో పేర్కొన్నారు. కానీ 2014 లోక్‌సభ ఎన్నికలపుడు తాను యశోదాబెన్‌ అనే ఆమెను వివాహం చేసుకున్నట్లు రాశారు. వివాహం గురించే నిజాలు దాచారు గనుక డిగ్రీల గురించి కూడా అనుమానం తలెత్తింది. సమాచార హక్కు చట్టం కింద వచ్చిన ఒక దరఖాస్తుకు "ప్రధాని విద్యార్హతల వివరాలు ప్రధాని కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉన్నాయి. మీ ప్రధాని గురించి తెలుసుకోండి అన్నీ దానిలో దొరుకుతాయి. కోరిన సమాచారం కావాలంటే ఎన్నికల కమిషన్‌ను అడగండి" అని సమాధానం చెప్పింది ప్రధాని కార్యాలయం. దానికి ఇ.సి ఏం చెప్పిందంటే ఈ సమాచారం తమ దగ్గర లేదని, సిసిఐ.ఎన్‌ఐసి.ఇన్‌లో అభ్యర్థుల అఫిడవిట్లు అన్న విభాగంలో చూడవచ్చని పేర్కొన్నది. మోడీ ఎం.ఎ డిగ్రీ గురించి సమాచారం అడిగితే గుజరాత్‌ విశ్వవిద్యాలయం ఒక్క ముక్కలో "ఆర్‌టిఐ చట్టం 2005 ప్రకారం ఈ సమాచారాన్ని బహిర్గత పరచకూడదు" అని జవాబిచ్చింది.

మోడీ డిగ్రీల వ్యవహారం మరో మలుపు తిరిగింది. తమకు కావాల్సిన సమాచారం ఇవ్వలేదంటూ కమిషన్‌ అప్పిలేట్‌ అధికారులకు దరఖాస్తు చేశారు. దాన్ని విచారించిన కమిటీ ఏం చెప్పిందంటే "ప్రజా సంబంధ అధికార వ్యవస్థ తమ దగ్గర ఉన్న సమాచారం ఇవ్వాల్సి ఉంది. ఆఫీసు రికార్డులో లేనిదాన్ని ఇవ్వలేరు. ప్రధాని కార్యాలయం కూడా అదే వివరాలను ఇవ్వాలనటం సరైంది కాదు.సమాచార హక్కు చట్టంలోని సెక్షన్‌ 2(జె) ప్రకారం ఈ సమాచారాన్ని ప్రధాని కార్యాలయ విడుదల చేయనవసరం లేదు. ప్రధాన మంత్రి కావటానికి కనీస అర్హతలను నిర్వచించలేదు గనుక మోడీ డిగ్రీల గురించిన వివరాలను ప్రధాని కార్యాలయం కలిగి ఉండాల్సిన అవసరం లేదు" అని పేర్కొన్నది. అడిగిన సమాచారం సాధారణంగా ఉందని, రోల్‌ నంబరు లేకుండా తాము ఎలాంటి సమాచారం ఇవ్వలేమని ఢిల్లీ విశ్వవిద్యాలయం చేసిన వాదనను అంగీకరించింది. ఈ పరిణామం తరువాత అరవింద్‌ కేజ్రీవాల్‌ కేంద్ర సమాచార ప్రధాన కమిషనర్‌ మాడభూషి శ్రీధర్‌ ఆచార్యులకు లేఖ రాశారు. దాన్నే సమాచార హక్కు దరఖాస్తుగా పరిగణించి నరేంద్ర మోడీ డిగ్రీల రోల్‌ నంబర్లు అందచేస్తే వివరాలను తెలుసుకో వచ్చునంటూ ప్రధాని కార్యాలయాన్ని శ్రీధర్‌ కోరారు.

రెండు విశ్వ విద్యాలయాలు కూడా నరేంద్ర మోడీకి ఎలాంటి డిగ్రీలు ఇవ్వలేదని చెబితే ఏమౌతుంది? ప్రస్తుతం ఉన్న శిక్షాస్మృతి లోని సెక్షన్‌ 191 ప్రకారం ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారం ఇవ్వటం నేరపూరితమైన తప్పిదం. దానికి శిక్ష ఏమిటో స్పష్టంగా లేదు. ప్రజాస్వామిక సంస్కరణల కోసం పని చేసే సంస్థ (ఏడిఆర్‌) 1999లో వేసిన ప్రజాప్రయోజన దావా, తరువాత కోర్టులు ఇచ్చిన తీర్పులతో ఎన్నికల్లో పోటీ చేసే వారు తమ నేర, ఆర్థిక, విద్యకు సంబంధించిన వివరాలను నామినేషన్‌ పత్రాల్లో విధిగా సమర్పించాలి. వాటిలో అక్రమాలుంటే నేరపూరితం అవుతుంది. ఈ వివరాలు వాస్తవమా కాదా అన్నది ఎన్నికల కమిషన్‌ విచారించదు, తప్పని తేలినా శిక్షించే అధికారం దానికి లేదు. అందుకే కోర్టులకు వెళుతున్నారు. అఫిడవిట్లలో పేర్కొన్న అంశాలను ఇంటిలిజెన్సీ సంస్థల ద్వారా తనిఖీ చేయించవచ్చని సుప్రీం కోర్టు చెప్పింది. అలా చేయ కూడదని కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది. స్వల్పకాలంలో తనిఖీ చేసే అవకాశం లేదని ఎన్నికల కమిషన్‌ కూడా పేర్కొన్నది. తరువాత కనీసం గెలిచిన వారి వివరాలను ఆరు నెలల్లో తనిఖీ చేయించాలని ఏడిఆర్‌ కోరినా ఎన్నికల కమిషన్‌ పట్టించుకోవటం లేదు, అఫిడవిట్లన్నీ ఆదాయపన్ను శాఖకు పంపుతున్నామని మాత్రమే చెప్పింది, ఐటి శాఖ చేస్తున్నదేమీ లేదు. గుజరాత్‌ అసెంబ్లీ ఎన్నికల్లో తన వివాహ స్థితి గురించి నరేంద్రమోడీ ఎలాంటి సమాచారం ఇవ్వలేదంటూ సునీల్‌ సరవాగి దాఖలు చేసిన పిటీషన్‌పై 2013లో సుప్రీం కోర్టు తీర్పు చెబుతూ ఎన్నికల కమిషన్‌ కోరిన వివరాలను ఇవ్వని వారి నామినేషన్లను తిరస్కరించాలని పేర్కొన్నది. దాంతో విధిలేక నరేంద్రమోడీ 2014 ఎన్నికల్లో తనకు యశోదాబెన్‌తో వివాహం జరిగినట్లు నామినేషన్‌ పత్రాల్లో పేర్కొనవలసి వచ్చింది. క్రమశిక్షణకు మారుపేరు సంఘపరివార్‌ అని చెప్పుకొనే వారు కూడా కోర్టు ఆదేశిస్తే తప్ప నిజాలు చెప్పరన్నమాట!

ప్రజాస్వామిక వ్యవస్థలను పటిష్ట పరుస్తామని చెప్పుకొనే బిజెపి, కేంద్ర ప్రభుత్వం లా కమిషన్‌ చేసిన ఒక చక్కటి సిఫార్సును పక్కన పడేశాయి. తప్పుడు అఫిడవిట్లు ఇస్తే అనర్హత వేటు వేయాలని, ఇప్పుడున్న ఆరు నెలల శిక్షను రెండు సంవత్సరాలకు పెంచాలని, ఈ కేసులను రోజు వారీ విచారించాలని, నామినేషన్ల దాఖలు ఆఖరి గడువుకు తనిఖీకి వారం రోజుల వ్యవధి ఉంటే ఎవరైనా తప్పుడు సమాచారమిస్తే వాటి మీద అభ్యంతరాలు దాఖలు చేసేందుకు తగినంత వ్యవధి ఉంటుందని చెప్పింది. కానీ గత తొమ్మిదేళ్లుగా మోడీ సర్కార్‌ పట్టించుకోలేదు, అలాంటి ఆలోచనలో ఉన్నట్లు కూడా కనిపించటం లేదు. ఈ పూర్వరంగంలో నరేంద్రమోడీ డిగ్రీల గురించి వివరాలను వెల్లడించాల్సిన అవసరం లేదని గుజరాత్‌ హైకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు అనేక మందిని దిగ్భ్రాంతికి గురిచేసింది, అనేక అనుమానాలకు తెరలేపింది. ఏడు సంవత్సరాల క్రితం కేంద్ర సమాచార కమిషన్‌ ఇచ్చిన ఆదేశానికి సంబంధించిన ఉదంతంలో నరేంద్ర మోడీ డిగ్రీ వివరాలను అందచేయాలని గుజరాత్‌ విశ్వవిద్యాలయాన్ని ఢిల్లీ సి.ఎం కేజ్రీవాల్‌ కోరటం చెల్లదని గుజరాత్‌ హైకోర్టు తీర్పు చెప్పింది. అంతేగాక కేజ్రీవాల్‌కు రూ.25 వేల జరిమానా కూడా విధించింది. దీని మీద కేజ్రీవాల్‌ ధ్వజమెత్తారు. మోడీ డిగ్రీల మీద అనుమానాలను పెంచిందన్నారు. తమ సంస్థలలో మోడీ డిగ్రీలు పొందినందుకు పండగ చేసుకోవాల్సిన గుజరాత్‌, ఢిల్లీ విశ్వవిద్యాలయాలు సమాచారాన్ని దాచేందుకు చూస్తున్నాయన్నారు.

నరేంద్ర మోడీ పొందిన డిగ్రీలంటూ బిజెపి నేతలు గతంలో ప్రదర్శించిన కాపీలలో రోల్‌ నంబరు గానీ, తండ్రి పేరు గానీ లేదు. అందువలన అవి నకిలీ అని అనేక మంది భావిస్తున్నారు. 1978లో డిగ్రీలను చేతిరాత ద్వారా జారీ చేసేవారు. కానీ బిజెపి నేతలు చూపిన వాటిని కంప్యూటర్‌ అక్షరాలతో ప్రచురించినట్లుగా ఉంది. 1994లో ఆ అక్షరాలకు మైక్రోసాఫ్ట్‌ పేటెంట్‌ హక్కు పొందింది. అలాంటిది 1978 డిగ్రీలో ఎలా ముద్రించారన్నది ప్రశ్న. అవీ తప్పుల తడకలు. ఎం.ఎ మొదటి భాగంలో నరేంద్ర కుమార్‌ దామోదరదాస్‌ మోడీ అని ఉంటే రెండవ భాగంలో నరేంద్ర దామోదర్‌దాస్‌ మోడీ అని ఉంది.

ఇంత రచ్చ జరుగుతున్నా నరేంద్ర మోడీ నోరు మెదపటం లేదు. అనేక మంది మోడీ భక్తులకు ఈ పరిణామాలు మింగుడు పడటం లేదు. మోడీ వాస్తవాలు చెప్పి విమర్శకుల నోళ్లు ఎందుకు మూయించటం లేదని వారిలో వారు మదనపడుతున్నారు. కోర్టులు, నిబంధనలు ఎలా ఉన్నా నైతిక బాధ్యతగా ఎందుకు వెల్లడించరు, ఎందుకు పిరికిబారుతున్నారు అన్నది ప్రశ్న. ★

కవిత్వం

జనజాగృతి

కలానికి కులం లేదు
కవనానికి మతం లేదు
సాహిత్యానికి భాషాబేధం లేదు
ఉన్నదల్లా ఒక్కటే .....
ప్రశ్నించే తత్వం
ప్రక్షాళన చేసే నైజం
మార్పు తెచ్చే గుణం
మేల్కొలిపే భావజాలం
మేలు చేసే భాషాభావం
ఎదిరించే పిడికిలి
మానవత్వం కోసం
నిత్యం పోరాడే పటిమ
సమానత్వం కోసం
పరితపించే హృదయం
అదే కలం.....
అదే కవనం....
అదే సాహిత్యం....

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
సెల్‌ : 9441791239

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్‌ :
editpageps@ gmail.com

చెరుకు ధర టన్నుకు రూ.5 వేలు

- జంతర్‌మంతర్‌లో రైతన్నల డిమాండ్
- బకాయిలన్నీ చెల్లించాలి
- మూసివేసిన షుగర్ మిల్లులు తెరవాలి
- ప్రైవేటీకరణ ఆపాలి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ వీధుల్లో చెరుకు రైతులు కదంతొక్కారు. కనీస మద్దతు ధర కల్పించాలని, బకాయిలు తక్షణమే చెల్లించాలని, ప్రభుత్వ, సహకార చక్కెర మిల్లుల ప్రయివేటీకరణ ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ

అఖిల భారత చెరుకు రైతుల సమాఖ్య (ఎఐఎస్‌సిఎఫ్‌ఎఫ్) ఆధ్వర్యంలో స్థానిక జంతర్‌మంతర్ వద్ద గురువారం జరిగిన ఈ ఆందోళనల్లో దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన చెరుకు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పది రాష్ట్రాల నుంచి చెరుకు రైతుల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌సిఎఫ్‌ఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి రవీంద్రన్, ఎన్‌కె శుక్లా మాట్లాడుతూ చెరుకు ధరను 9.5 శాతం రికవరీతో టన్నుకు రూ.5 వేలు చొప్పున చెల్లించాలని, సహకార, ప్రభుత్వ రంగ షుగర్ మిల్లుల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. మూసివేసిన సహకార, ప్రభుత్వ రంగ చక్కెర కర్మాగారాలను తెరవడానికి, నిర్వహించడానికి జాతీయ సహకారాభివృద్ధి సంస్థ ద్వారా వడ్డీ రహిత రుణాలను అందజేయాలని కోరారు. 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సహకార, ప్రభుత్వ రంగ మిల్లులను పునరుద్ధరించి ఆధునీకరించాలన్నారు. 2025 నాటికి ఇథనాల్ ఉత్పత్తిని పెంచే ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, దేశవ్యాప్తంగా ఉన్న సహకార చక్కెర కర్మాగారాల్లో ఇథనాల్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 1966 షుగర్ కంట్రోల్ ఆదేశాల ఆధారంగా సరఫరా చేసిన చెరకుకు 14 రోజుల్లోగా సొమ్మును చెల్లించి, బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేట్ల ప్రయోజనాలకే రంగరాజన్ కమిటీ : విజూ కృష్ణన్

ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ మాట్లాడుతూ రంగరాజన్ కమిటీ రిపోర్టును తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఆ రిపోర్టు కేవలం కార్పొరేట్ల ప్రయోజనాల కోసం రూపొందించినట్లు ఉందన్నారు. చెరకు రైతులకు రూ.23 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, వాటిని రైతులకు ఇప్పటికీ కూడా ఇవ్వలేదని వాపోయారు. చెరుకు రైతుల సమస్యలు చెప్పుకుందామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కోరితే, బిజెపి వ్యవస్థాపక దినోత్సవం ఉందని, తాను అపాయింట్‌మెంట్ ఇవ్వలేనని కేంద్ర మంత్రి అనడం దారుణమన్నారు. కేంద్ర మంత్రులు రైతుల హితం కోరుకోవడం లేదని, కార్పొరేట్ల లాభాలే లక్ష్యంగా పని చేస్తున్నారని విమర్శించారు. ఏపి, తెలంగాణలో టయోట వంటి బహుళ జాతి కంపెనీలను తీసుకొచ్చేందుకు ప్రయత్నం జరుగుతోందని, ఇతర దేశాల్లోంచి షుగర్‌ను దిగుమతి చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. అందుకనే షుగర్‌పై దిగుమతి సుంకం తగ్గిస్తున్నారని విమర్శించారు. దేశంలోని షుగర్ మిల్లులను మూసివేసి, రైతులకు నష్టం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బల్వాన్ సింగ్ (హర్యానా), ప్రభురాజ్ ఎన్.రావు (బీహార్), ఎల్.మారన్ (తమిళనాడు), మారారిల్లా ఠాకూర్ (మధ్యప్రదేశ్), ఉమేష్ దేశ్‌ముఖ్ (మహారాష్ట్ర), పుష్పేంద్ర త్యాగి (ఉత్తరప్రదేశ్), ఎఐకెఎస్ నేతలు హన్నన్ మొల్లా, కృష్ణ ప్రసాద్, బాదల్ సరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపిలో 24 ఫ్యాక్టరీలు మూసివేత
కర్రి అప్పారావు



ఆంధ్రప్రదేశ్ చెరుకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ చెరుకు రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దుర్మార్గంగా వ్యవహరించడంతో అత్యంత కష్టాలు పడుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పది సహకార షుగర్ ఫ్యాక్టరీలతో సహా 29 షుగర్ ఫ్యాక్టరీలు ఉండేవని, అయితే అందులో తొమ్మిది సహకార షుగర్ ఫ్యాక్టరీలతో 24 ఫ్యాక్టరీలను మూసివేశారని తెలిపారు. ప్రస్తుతం ఒక సహకార షుగర్ ఫ్యాక్టరీతో సహా కేవలం ఐదు ఫ్యాక్టరీలు మాత్రమే పని చేస్తున్నాయని అన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలోనే 18 షుగర్ ఫ్యాక్టరీలు మూసివేశారని విమర్శించారు. రాష్ట్రంలో ఐదు లక్షల ఎకరాల్లో చెరకు సాగు అయ్యేదని, గిట్టుబాటు లేక సాగు 1.40 లక్షల ఎకరాలకు పడిపోయిందని తెలిపారు. ఐదు ఫ్యాక్టరీలు రైతులకు ఇవ్వాల్సిన రూ.200 కోట్ల బకాయిలు చెల్లించలేదని, బకాయిలు వెంటనే చెల్లించాలని ఉద్యమిస్తే 95 మంది రైతులపై కేసులు బనాయించారని వివరించారు. ఒక్క విజయనగరం జిల్లాలోనే 37 మంది మహిళలతో సహా రైతులపై కేసులు బనాయించారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు చెరకుకు ఇతర రాష్ట్రాల్లో ఇచ్చేదానికి తక్కువ లేకుండా ప్రోత్సాహకం ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ దాన్ని ఇప్పటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. దేశంలోని రెండో అతిపెద్ద బెల్లం మార్కెట్ అనకాపల్లిలో ఉందని, దాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. సారా, బ్రాందీకి బెల్లం వెళ్తుందనే నెపంతో అక్కడి బెల్లాన్ని నిరోధిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నుంచి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ రెడ్డి, చెరుకు రైతుల సంఘం నేతలు రాంబాబు, గండి నాయన బాబు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నేతలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

- ఎస్ఎఫ్ఐ సిఇసి డిమాండ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ (ఎపిసియు)లో ఐదుగురు ఎస్ఎఫ్ఐ నేతలపై విధించిన సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విపి సాను, మయూక్ బిశ్వాస్ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఐదుగురు ఎస్ఎఫ్ఐ నేతలను అన్యాయంగా, ఏకపక్షంగా సస్పెండ్ చేయడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. విద్యార్థుల భావప్రకటన, ప్రాథమిక హక్కుకు స్పష్టమైన ఉల్లంఘనే సస్పెన్షన్ అని పేర్కొన్నారు. పరీక్షల విభాగంలో యూనివర్సిటీ చేసిన అవకతవకలను ఎస్ఎఫ్ఐ బహిర్గతం చేసినందుకు సస్పెన్షన్ వేటు వేశారని, సమస్యలను లేవనెత్తుతూ ఎస్ఎఫ్ఐ వైస్ ఛాన్సలర్‌కు లేఖ రాసిందని తెలిపారు. మరోవైపు ఎస్ఎఫ్ఐపై యూనివర్సిటీ ఆరోపణలు చేస్తూ అసలు విషయాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఎపిసియు వైస్ ఛాన్సలర్ నియంతృత్వాన్ని క్యాంపస్‌లోని విద్యార్థి లోకం సహించదని తాము గుర్తు చేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయం లోపల, వెలుపల సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు విద్యార్థులకు ఉందని, విద్యార్థుల భావప్రకటనా స్వేచ్ఛను హరించడానికి ఎవరికీ హక్కు లేదని పేర్కొన్నారు. యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని, వారితో నిర్మాణాత్మక చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సస్పెండ్‌కు గురైన విద్యార్థులకు సంఘీభావంగా నిలబడాలని, క్యాంపస్‌లలో అసమ్మతిని అణచివేసే ప్రయత్నాన్ని ప్రతిఘటించాలని అభ్యుదయ శక్తులకు పిలుపునిచ్చారు. ఐదుగురు విద్యార్థుల సస్పెన్షన్‌ను తక్షణమే, బేషరతుగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆక్స్‌ఫామ్ ఇండియాపై సిబిఐ దర్యాప్తు

- కేంద్ర హోంశాఖ ప్రతిపాదన

న్యూఢిల్లీ : సమాజంలో వెనుకబడిన వర్గాల ఆహారం, ఆశ్రయం, విద్య వంటి అంశాలపై పనిచేసే అతిపెద్ద ఎన్‌జిఓల్లో ఒకటైన ఆక్స్‌ఫామ్ ఇండియా ఎఫ్‌సిఆర్‌ఎ నిబంధనలను ఉల్లంఘించిందన్న ఆరోపణలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలంటూ కేంద్ర హోంశాఖ గురువారం సిఫార్సు చేసింది. విదేశీ నిధులను అందుకునేందుకు వీలు కల్పించే ఎఫ్‌సిఆర్‌ఎ రిజిస్ట్రేషన్‌ను 2021లో ఆక్స్‌ఫామ్ ఇండియా పునరుద్ధరించుకోలేదని పేర్కొంది. సామాజిక కార్యకలాపాలు చేపట్టేందుకు ఎఫ్‌సిఆర్‌ఎ కింద ఎన్‌జిఓ రిజిస్టర్ అయిందని, ఆ రిజిస్ట్రేషన్ 2021 డిసెంబరు 31వరకు చెల్లుబాటైందని గురువారం సీనియర్ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. విదేశీ విరాళాల (క్రమబద్ధీకరణ) సవరణ చట్టం, 2020 అమల్లోకి వచ్చిన తర్వాత కూడా వివిధ ఇతర సంస్థలకు విదేశీ నిధులను బదిలీ చేయడాన్ని ఆక్స్‌ఫామ్ కొనసాగించిందని ఆయన చెప్పారు.

అవినీతి, బంధుప్రీతిని అణచివేస్తాం

- బిజెపి వ్యవస్థాపక దినోత్సవంలో మోడీ గొప్పలు

న్యూఢిల్లీ : అవినీతి, బంధుప్రీతిలను ఉక్కుపాదంతో అణచివేసేందుకు కఠిన చర్యలు చేపట్టగలిగే సామర్థ్యం, అంకితభావం కలిగిన పార్టీ బిజెపి అని ప్రధాని నరేంద్రమోడీ గురువారం గొప్పలు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తన సన్నిహితుడు గౌతమ్ అదానీపై విచారణకు పార్లమెంటరీ సంయుక్త కమిటీ (జెపిసి) వేసేందుకు ససేమిరా అంటూ బడ్జెట్ సమావేశాలను ముగించిన నేపథ్యంలో మోడీ ఈ వ్యాఖ్యలు చేయడం విడ్డూరం. బిజెపి 44వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రసంగించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల పట్ల ఉదాసీనత వద్దని పార్టీ కార్యకర్తలను ప్రధాని హెచ్చరించారు.

అల్ అక్సా మసీదుపై ఇజ్రాయిల్ మళ్లీ దాడి

జెరూసలెం: జెరూసలెంలోని అల్ అక్సా మసీదుపై ఇజ్రాయిల్ మరో మారు దాడి చేసింది. పవిత్ర రంజాన్ మాసంలో వేలాది మంది పాలస్తీనీయులు మసీదులో గురువారం సాయంత్రం ప్రార్థనలు చేసుకుంటుండగా ఇజ్రాయిల్ దళాలు దాడి చేశాయి. అల్ అక్సా మసీదుపై ఈ విధంగా దాడులు చేయడం గడచిన 24 గంటల్లో రెండవసారి. వాఫా వార్తా సంస్థ తెలిపిన వివరాల ప్రకారం 20 వేల మంది ఆరాధకులు ఖిబ్లీ ప్రార్థనా మందిరంలో ప్రార్థనలు చేస్తుండగా సాయుధులైన ఇజ్రాయిలీ దళాలు ఆ హాలుపై దాడి చేశారు. భక్తులను అక్కడి నుంచి బలవంతంగా వెళ్లగొట్టడానికి గ్రెనేడ్లు, టియర్ గ్యాస్, రబ్బరు పూతతో కూడిన ఇనుప బులెట్లు ప్రయోగించారు. ఈ దాడిలో ఆరుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు పాలస్తీనా రెడ్ క్రెసెంట్ సొసైటీ తెలిపింది. అంతకుముందు రోజు ఇదే మసీదుపై ఇజ్రాయిల్ దళాలు జరిపిన దాడిలో 200 మంది దాకా గాయపడ్డారు. 400 మందిని అరెస్టు చేశారు. ఇజ్రాయిలీ సైనికుల దాడిని టర్కీ తీవ్రంగా ఖండించింది. అరబ్ లీగ్ దేశాలు కూడా ఇజ్రాయిల్ చర్యను నిరసించాయి.

స్పీకర్ తేనీటి విందుకు విపక్షాలు దూరం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ సమావేశాల ముగింపు రోజున సాయంత్రం లోక్‌సభ స్పీకర్ సభ్యులందరికీ తేనీటి విందును ఏర్పాటు చేయడం, సభ్యులందరినీ ఆహ్వానించడం పరిపాటి. బడ్జెట్ సమావేశాల ముగింపు సందర్భంగా స్పీకర్ ఓం బిర్లా ఆతిథ్యమిచ్చిన తేనీటి విందును ప్రతిపక్షాల సభ్యులు బహిష్కరించారు. సభాసాంప్రదాయాలు మంటగలిపి ప్రతిపక్షాల గొంతును పెగలనివ్వకుండా సమావేశాలు జరిగిన నేపథ్యంలో నిరసనగా ఈ విందును బహిష్కరించినట్లు కొందరు ప్రతిపక్ష నేతలు వాపోయారు. అయితే ఈ తేనీటి విందుకు ప్రతిపక్ష పార్టీల ఎంపిల్లో ఒకే ఒక్కరు హాజరయ్యారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా మాత్రమే హాజరయ్యారు. ఆ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు అక్కడే ఉన్నారు. ఫరూఖ్ అబ్దుల్లాతో కలిసి ముచ్చటిస్తూ కనిపించారు.

ముగిసిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

- ఆరు బిల్లులు ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. అధికార, ప్రతిపక్షాల ఆందోళనలతో అధిక భాగం వాయిదాల పర్వమే కొనసాగింది. దీంతో ఉభయ సభలు షెడ్యూల్ కంటే చాలా తక్కువ సమయమే పనిచేశాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మొత్తం 8 బిల్లులు ప్రవేశపెట్టగా, 6 బిల్లులు ఉభయ సభల్లో ఆమోదం పొందాయి. ఈ సమావేశాల్లో లోక్‌సభ 34 శాతం, రాజ్యసభ 24 శాతం జరిగింది. జనవరి 31న ప్రారంభమైన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు గురువారం ముగిశాయి.

మొదటి విడత జనవరి 31 నుంచి ఫిబ్రవరి 12 వరకు, రెండో విడత మార్చి 13 నుంచి ఏప్రిల్ 6 వరకు జరిగాయి. మొదటి విడతలో పది రోజులు, రెండో విడతలో 15 రోజులు కార్యాకలాపాలు జరిగాయి. మొత్తం 25 రోజుల పాటు సమావేశాలు జరిగాయని పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి



విడతలో పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో 13.44 గంటలు, రాజ్యసభలో 12.42 గంటలు పాటు చర్చ జరిగింది. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన బడ్జెట్‌లపై ఉభయ సభల్లో సాధారణ చర్చ జరిగింది. లోక్‌సభలో 14.45 గంటలు, రాజ్యసభలో కేవలం 2.21 గంటల పాటు మాత్రమే చర్చ జరిగింది. లోక్‌సభలో నిరంతర అంతరాయాల కారణంగా రైల్వేలు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గిరిజన వ్యవహారాలు, పర్యాటకం, సంస్కృతి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం వంటి మంత్రిత్వ శాఖల గ్రాంట్ల కోసం డిమాండ్లపై చర్చ జరగలేదు. రాజ్యసభలో స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, టెక్స్‌టైల్స్, ఫిషరీస్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, గ్రామీణాభివృద్ధి, సహకారం, రైల్వేలు, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖల పనితీరుపై సభలో నిరంతర అంతరాయాల కారణంగా చర్చ జరగలేదు.


తీవ్ర అంతరాయం

రెండో విడత సమావేశాల్లో లోక్‌సభ 45 గంటలు, రాజ్యసభ 31 గంటల పాటు పనిచేసిందని పిఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసర్చ్ సర్వే డేటా వెల్లడించింది. అదానీ గ్రూప్-హిండెన్ బర్గ్ నివేదిక వ్యవహారం ఉభయ సభలను కుదిపేసింది. ఈ ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు దిగాయి. దీంతో సభలు తరచూ స్తంభించాయి. లోక్‌సభ మొత్తం 133.6 గంటలు పనిచేయాల్సి ఉండగా కేవలం 45 గంటలు (34.28 శాతం) పనిచేసింది. ఇక రాజ్యసభను 130 గంటలు నిర్వహించాల్సి ఉండగా.. 31 గంటల (24 శాతం) పాటు మాత్రమే పనిచేసిందని సర్వే డేటా స్పష్టం చేసింది.

బహుళ ధ్రువ ప్రపంచమే లక్ష్యం

జిన్‌పింగ్,మాక్రాన్ భేటీ

బీజింగ్ : చైనాలో రెండు రోజుల పర్యటనకు వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమానియెల్ మాక్రాన్ చైనా అధ్యక్షుడ సీ జిన్‌పింగ్‌తో గురువారం భేటీ అయ్యారు. వివిధ రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకార సంబంధాలను మెరుగుపరచుకోవాలని, బహుళ ధ్రు వప్రంచ సాధనకు కలసికట్టుగా కృషి చేయాలని ఇరువరు నేతలు ఉద్ఘాటించారు. చర్చల అనంతరం మాక్రాన్, సీ జిన్‌పింగ్ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. చైనా, ఫ్రాన్స్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలుగా, స్వతంత్రత కలిగిన ప్రధాన దేశాలుగా ఉన్నాయని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ అన్నారు. మూడేళ్ల విరామం తరువాత మొదటిసారి ఫ్రాన్స్ అధ్యక్షుడు చైనా సందర్శించడాన్ని ఆయన



స్వాగతించారు. స్థిరమైన, పరస్పర ప్రయోజనకరమైన, చైతన్యవంతమైన చైనా, ఇయు సంబంధాల్లో ఇది కొత్త ఉత్తేజాన్ని నింపుతుందని అన్నారు. వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలతోబాటు చైనా, ఫ్రాన్స్ ప్రజల మధ్య పరస్పర మైత్రిని పెంపొందించుకునేందుకు ఇరు దేశాలు కృతనిశ్చయంతో ఉన్నాయని జిన్‌పింగ్ చెప్పారు. చైనాను ఒంటరిపాటు చేసే ఎటువంటి యత్నాలను తాను సమర్థించబోనని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ అన్నారు. ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వం, కూటమి ఘర్షణలకు తాను వ్యతిరేకమన్నారు. బహుళ ధ్రువ ప్రపంచం కోసం, అంతర్జాతీయ సంబంధాల్లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా చూడడానికి తాము పాటుపడతామని మాక్రాన్ చెప్పారు. దీనిపై జిన్‌పింగ్ జోక్యం చేసుకుని బహుళ ధ్రువ ప్రపంచంలో చైనా ఎల్లప్పుడూ ఐరోపాను స్వతంత్ర ధ్రువంగా చూస్తుందని అన్నారు. ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ పరిష్కారం కనుక్కోవాలని ఫ్రాన్స్‌తో కలసి సంయుక్తంగా పిలుపునిచ్చేందుకు చైనా సిద్ధంగా ఉందని జిన్ పింగ్ పేర్కొన్నారు.

ఐదువేలకు పైగా కరోనా కేసులు

న్యూఢిల్లీ : గత కొన్నిరోజులుగా ప్రతిరోజూ వెయ్యికిపైగా కరోనా కొత్త కేసులు నమోదవుతూ ఆందోళన కలిగిస్తోందని ఆరోగ్యమంత్రిత్వశాఖ వెల్లడించింది. గడచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 5,335 కొత్త కరోనా కేసులు నమోదై.. 195 రోజుల గరిష్టానికి చేరినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ గురువారం వెల్లడించింది. గత ఏడాది సెప్టెంబర్ 23వ తేదీన రికార్డుస్థాయిలో ఒక్కరోజునే 5,383 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇక దేశవ్యాప్తంగా ప్రస్తుతం 25,587 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

పరిణామాలు తీవ్రంగా ఉంటాయి

- అమెరికన్ స్పీకర్‌తో తైవాన్ నేత భేటీపై చైనా

బీజింగ్: చైనాలోని తైవాన్ ద్వీప ప్రాంత నాయకురాలు త్సాయి ఇంగ్ వెన్ అమెరికన్ ప్రతినిధుల సభ స్పీకర్ మెక్‌కార్థీతో గురువారం సమావేశం కావడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. 1979లో అమెరికా చైనాతో దౌత్య సంబంధాలను పునరుద్ధరించినప్పుడు తైవాన్‌తో దౌత్య సంబంధాలను తెంచుకుంటూ, ఒక చైనా విధానాన్ని (తైవాన్ ద్వీపాన్ని చైనాలో అంతర్భాగంగా గుర్తించడం) సమర్థిస్తున్నామని చెప్పింది. దానికి భిన్నంగా ఇప్పుడు త్సాయి ఇంగ్ వెన్‌తో అమెరికన్ హౌస్ ఆఫ్ కాంగ్రెస్‌లో దిగువ సభ అధిపతి కాలిఫోర్నియాలో భేటీ అయ్యారని, దీని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని అమెరికాను చైనా హెచ్చరించింది. మరో వైపు త్సాయి ఇంగ్ వెన్ అమెరికా పర్యటనను నిరసిస్తూ తైవాన్ దీవ్రపంలో రాజకీయ నాయకులు, పౌర సమాజ సంస్థలు గురువారం ప్రదర్శనలు నిర్వహించాయి. త్సాయి ఇంగ్ తోడేళ్లతో సహవాసం చేస్తోందని వారు విమర్శించారు. ఇది ద్వీపంలోని ప్రజలకు ద్రోహం చేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ ద్వీపానికి అమెరికా పెద్దయెత్తున ఆయుధాలు విక్రయించడం ద్వారా తమ భూభాగాన్ని మరు భూమిగా మార్చాలని అమెరికా చేస్తున్న కుట్రలకు త్సాయి ఇంగ్ సహకరిస్తున్నారని నిరసనకారులు పేర్కొన్నారు.

బీజింగ్‌లో ఇరాన్, సౌదీ మంత్రుల భేటీ

బీజింగ్ : మధ్య ప్రాచ్యంలో బద్ధ విరోధులైన ఇరాన్, సౌదీ అరేబియాల విదేశాంగ మంత్రులు గురువారం బీజింగ్‌లో భేటీ అయ్యారు. చైనా మధ్యవర్తిత్వంతో కుదిరిన ఒప్పందం ఇరు దేశాల మధ్య సంబంధాలు సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు మార్గం సుగమం చేసింది. సౌదీ దౌత్య కార్యాలయాలపై ఇరాన్ ఆందోళనకారులు దాడి చేసిన తర్వాత ఏడేళ్ళ క్రితం తెగిపోయిన సంబంధాలను పునరుద్ధరించుకునేందుకు గత నెల్లో ఇరు దేశాలు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతిదారు, ప్రధానంగా సున్నీ ముస్లింలు వుండే సౌదీ అరేబియాకు, షియాలు మెజారిటీగా వుండే ఇరాన్‌కు మధ్య ప్రాచ్యం అంతటా శాంతిని నెలకొల్పే శక్తి సామర్థ్యాలు వున్నాయి. ఒప్పందం వివరాలను ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ, సౌదీ ప్రభుత్వ టివి చానెల్ అల్ ఎక్‌భరియాలు ప్రకటించాయి.



గత నెలలో కుదిరిన ఒప్పందం మేరకు ఇరు దేశాలు రెండు మాసాల్లోగా తమ ఎంబసీలను, దౌత్య కార్యాలయాలను తిరిగి ప్రారంభించనున్నాయి.

వదంతుల వ్యాప్తిపై క్షమాపణ చెప్పండి

- యుపి బిజెపి నేత ప్రశాంత్‌కు సుప్రీం ఆదేశాలు



న్యూఢిల్లీ : తమిళనాడులో బీహార్ వలస కార్మికులపై దాడులు జరిగాయంటూ సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేసిన కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన బిజెపి నేత, న్యాయవాది ప్రశాంత్ ఉమ్రావ్‌ను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది. ఇలాంటి చర్యలకు పాల్పడినందుకు తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. ఈ కేసుకు సంబంధించిన తదుపరి విచారణకు తమిళనాడు పోలీసులు ఎప్పుడు కోరితే అప్పుడు హాజరవ్వాలని నిర్దేశించింది. ఈ కేసుకు సంబంధించి ప్రశ్నించేందుకు 15 రోజుల పాటు తమిళనాడు పోలీసుల ముందు హాజరయ్యేందుకు మద్రాసు హైకోర్టు విధించిన ముందస్తు బెయిల్ షరతును సుప్రీం కోర్టు సవరించింది. 15 రోజుల పాటు ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.30 మధ్య పోలీసు స్టేషన్‌లో పిటిషనర్ రిపోర్ట్ చేయాల్సిన పరిస్థితిని సవరించింది. సోమవారం ఉదయం 10 గంటలకు ఆయన హాజరు కావచ్చు అని, ఆ తర్వాత దర్యాప్తు అధికారి ఎప్పుడు కోరితే అప్పుడు రావాల్సి వుంటుందని జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఉమ్రావ్ కూడా లాయరైనందున ఆయన మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మొట్టికాయలు వేసింది. తదుపరి విచారణ తేదీలోగా ఆయన క్షమాపణ చెప్పాల్సి వుందని నిర్దేశించింది.






మీకోసం

తులసి ఆకులు నీళ్లలో వేసుకొని ప్రతిరోజూ తాగుతుంటే గొంతు ఇన్ఫెక్షన్ తగ్గుతుంది.

జీవన సౌరభం

పనిచేసే ప్రతిసారీ సత్ఫలితాలు రాకపోవొచ్చు.. కానీ పని చేయకపోతే ఏ ఫలితమూ రాదు.

ఆదర్శం



రంగాపురంలో ఆశయ్యకు దానగుణం ఎక్కువ. సేవా సంస్థలకు విరాళంగా చాలా డబ్బును దానం చేసేవాడు. పేదవారికి లేదనకుండా తనకు తోచినంత సాయం చేసేవాడు. చుట్టుపక్కల గ్రామాల్లో ఆశయ్యకు మంచి పేరు ఉంది.


ఇలా ఉండగా ఒకసారి ఒక అన్నదాన సత్రం వారు ఆశయ్య వద్దకు వచ్చి ఆయనను అడిగి చాలా పెద్ద మొత్తంలో విరాళం తీసుకొని పోయారు. కొన్ని రోజుల తర్వాత వచ్చి ఆశయ్యకు సన్మానం చేయనున్నట్లు తెలిపారు. అందుకు తాను నిరాకరించాడు. కాని వారు బలవంతపెట్టబోయారు.

దాంతో ఆశయ్య ' మీరు సన్మానించాల్సింది నన్ను కాదు. ఈ ఊరిలో ఉన్న దానయ్యను. అతడే ఈ సన్మానానికి అర్హుడు' అని అన్నాడు. అప్పుడు వారు ఆశ్చర్యపోయారు. ' ఇదేమిటి? డబ్బు ఇచ్చింది మీరైతే ఆయనకు సన్మానం చేయమంటున్నారు' అని అన్నారు. అప్పుడు ఆశయ్య ' ఈ డబ్బులు నూటికి తొంభై శాతం అతడే ఇస్తున్నాడు. నేను కేవలం మిగతా పది శాతం మాత్రమే కలుపుతున్నాను. అతనికి తన పేరు చెప్పుకోవడం ఇష్టం లేదు. అందువల్ల తన పేరును ఎవ్వరికీ చెప్పవద్దని కోరాడు. అతని పేరు ఇంతవరకు ఎవరికీ చెప్పలేదు. కానీ ఇప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో మీకు అతని పేరు చెబుతున్నాను. అతడే మీ సన్మానానికి అర్హుడు. అతడే నాకు స్ఫూర్తి. ఆయన్ని చూసి మనమందరం చాలా నేర్చుకోవాలి.' అని అన్నాడు.

వారంతా ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. అంతా కలిసి దానయ్య దగ్గరకు వెళ్లారు. తాము అతనికి సన్మానం చేస్తామని కోరారు. అయినా దానయ్య ఒప్పుకోలేదు. వ్యక్తి ఆదరణ, పొగడ్తలు అంటే ఇష్టం లేదని, తనని ఇబ్బంది పెట్టొద్దని చెప్పాడు. దాంతో ఆయన ఆదర్శ జీవితాన్ని గ్రహించిన ఆ పెద్దలు వెనుదిరిగారు.

సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
99085 54535

చుక్కలు కలపండి



చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ





బలగంశెట్టి సిరి క్రిష్ణతి,
1వ తరగతి,
చిట్టూరి హైస్కూలు,
గాంధీనగర్, విజయవాడ.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇరి పట్టు.. అభివృద్ధి మెట్టు ...



చేనేత కుటుంబంలో పుట్టిన ఇయాషా రాంబాయ్ మేఘాలయలో ఉన్నత పాఠశాలలో గణిత టీచరుగా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయురాలిగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఆమె వంశపారంపర్యంగా తన కుటుంబ వారసత్వంగా వస్తున్న 'ఇరి పట్టు' చేనేత కళను మరుగున పడకుండా కాపాడుకుంటున్నారు. ఒకపక్క బోధనా బాధ్యతలు నిర్వహిస్తూనే మరోపక్క చేనేత కార్మికురాలిగా రాణిస్తూ.. ఇతర మహిళలకు ఉపాధి చూపుతున్నారు.

'2018లో స్కూలుకు బయలుదేరుతున్న నాకు ఓ ఫోను కాల్ వచ్చింది. అది 50 'ఇరి పట్టు' చీరల ఆర్డరు. అయితే నిర్ణీతకాలంలో మా కుటుంబం ఆ ఆర్డరు పూర్తి చేయలేదు. దీంతో మా గ్రామ మహిళలను సాయం కోరాను. ఇంటింటికీ తిరిగాను. ఇక్కడ ఈ నూలు చాలా సులభంగా దొరుకుతుంది. కాని స్థానికులకు దీనిపై పట్టు లేదు. దీంతో ఈ కళలో స్థానికులకు శిక్షణ ఇప్పించాలనుకున్నాను. అలా మా కుటుంబానికే పరిమితమైన ఈ కళ ఇప్పుడు మా ప్రాంతంలోని మహిళలకూ చేరువైంది' అంటూ సంతోషంగా చెబుతున్నారు ఇయాషా.

'ఆదరణ లేక, ప్రతిచోటా జరిగినట్లే వృత్తిదారులంతా ఇతర పనుల్లోకి వెళ్లిపోవడం వల్ల ఈ సాంప్రదాయ కళ మరుగున పడిపోయింది. చాలా తక్కువ మంది మాత్రమే ఈ కళను నమ్ముకుని బతుకుతున్నారు. మొదట్లో ఈ కళను నేర్పించేందుకు నేను సిద్ధంగా ఉన్నా, స్థానికులు విముఖత చూపారు. ఏదైనా ప్రయోజనం ఉండబట్టే మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చిందని పరుష మాటలు అన్నారు. అవును... నాకు ప్రయోజనం ఉంది. చనిపోతున్న కళను బతికించుకోవడమే నా లక్ష్యం అని చెప్పడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది' అంటూ ఆనాటి చేదు అనుభవాలను ఆమె గుర్తుచేసుకుంటారు.

శిక్షణ తీసుకున్న మహిళలను ప్రోత్సహించేలా, కళలో ప్రావీణ్యం సంపాదించిన మహిళలు ఇతర పనులకు వెళ్లకుండా ఉండాలని, భవిష్యత్తులో మరిన్ని ఆర్డర్లు ఇవ్వాలని స్థానిక హ్యాండ్‌లూమ్ కో ఆపరేటివ్ సొసైటీని కోరినట్లు ఆమె చెబుతున్నారు. అంతకంటే ముందుగా తనకు వచ్చిన ఆర్డరును పూర్తి చేసి దానికి ప్రాచుర్యం తెచ్చేందుకు ఆమె శక్తివంచన లేకుండా పనిచేశారు.





అహింస పట్టు లేక ఇరి పట్టు

సాధారణంగా పట్టు పురుగులను చంపి పట్టు దారాలు వడుకుతారు. కాని 'ఇరి పట్టు' అలా కాదు. పురుగులను చంపకుండానే దారం తీస్తారు. అందుకే దీన్ని 'అహింస పట్టు' లేక 'శాకాహారి పట్టు' అని కూడా పిలుస్తారు. సామియా సింథియా రిసిని మోత్, ఫిలోస్మియా రిసిని మోత్‌ల నుండి దీనిని సేకరిస్తారు. ఇవి ఆముదం, కాసావా ఆకులను తింటాయి. ఒక్క పట్టు పురుగు కూడా చనిపోకుండా కాయల నుండి పురుగులు బయటకు వచ్చాకే కాయలను ఉడకబెట్టి దారాలను తీస్తారు.

ఇరి పట్టుతో నేసిన వస్త్రాలు వేసవిలో చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉంటాయి. 'ఈ దారాలను అల్లికలు, క్రోచిట్, ఎంబ్రాయిడరీలో కూడా ఉపయోగించవచ్చ'ని ఇయాషా చెబుతారు.

బడి గంటలు ముగిసిన తరువాత చేనేత కార్మికురాలిగా బాధ్యత నిర్వహిస్తున్న ఇయాషా ప్రపంచ నలుమూలలకు ఇరి సిల్క్ బ్రాండ్‌ను పరిచయం చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇరి నేత ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడం కోసం ఓ వెబ్ సైట్‌ను ప్రారంభించారు. సోషల్‌మీడియా, ఇన్‌స్ట్రాగ్రామ్‌లలో ఈ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. ఆమె ప్రయత్నం ఫలించి 50 స్టార్టప్ కంపెనీలతో మేఘాలయ ప్రభుత్వం ప్రారంభించిన 'ప్రైమ్' కోహర్ట్ 2.0లో స్థానం దక్కింది. ఇటీవలె తన ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేసేందుకు ఆమె దుబాయ్ కూడా వెళ్లారు.

'చేతితో నేసే నేత కావడం వల్ల ఎక్కువ సమయం తీసుకుంటున్నా ఒక్కో మహిళ సుమారు రూ.15 వేలు సంపాదిస్తున్నారు. ఈ కొద్ది మొత్తమే వారి కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో చేయూతగా ఉంటుంది. పైగా కళ అంతరించిపోకుండా కాపాడుతున్నానన్న తృప్తి నన్ను చాలా సంతోషపెడుతోంది' అంటున్న ఇయాషా 'ఒక మహిళగా, తల్లిగా కుటుంబాన్ని, ఉపాధ్యాయురాలిగా విద్యార్థులను, వృత్తి కళాకారిణిగా కళను బతికించుకోవడానికి సమయం కేటాయించడం కొన్ని సార్లు కష్టంగా అనిపిస్తుంది. 'కాని సమర్థవంతమైన సమయ నిర్వహణతో అసాధ్యాలను సుసాధ్యం చేసుకుంటున్నాను. రానున్న రోజుల్లో మా ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లోకి అందుబాటులోకి రావాలని కలలు కంటున్నాను' అంటున్నారు.

మామిడి పండు.. ఆరోగ్యం మెండు..



వేసవికాలంలో వచ్చే మామిడిపండ్లను ఇష్టపడని వారంటూ ఉండరు. ఈ పండ్లు రుచికి మాత్రమే కాదు ఆరోగ్యానికి కూడా చాలా మంచివి.

- చర్మంపై ముడతలు, నల్ల మచ్చలను తొలగించడానికి మామిడి పండ్లు ఉపయోగపడతాయి.
- మామిడి పండ్లలో ఉండే విటమిన్ బి6 చర్మంలోని సెబమ్‌ను తగ్గిస్తుంది.
- మామిడి పండ్లలోని పొటాషియం చర్మానికి తేమ అందిస్తుంది.
- ఈ పండ్లలోని మెగ్నీషియం మొటిమలు, చర్మం జిడ్డును తగ్గిస్తుంది.
- ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు నోరాటిరియోల్, రెస్వెరాట్రాల్, మాంగిఫెరిన్, క్వెర్సెటిన్‌లు అతినీల లోహిత కిరణాల నుంచి చర్మాన్ని రక్షిస్తాయి.
- మామిడి పండ్ల గుజ్జును స్కిన్ మాస్క్‌లా ముఖానికి రాసుకుంటే మొటిమల వల్ల కలిగే మంట తగ్గుతుంది.
- ఈ పండ్లలో పొటాషియం, మెగ్నీషియం ఎక్కువగా ఉంటాయి. కాబట్టి అధిక రక్తపోటు నుంచి రక్షిస్తాయి.
- మామిడిలో ఉండే విటమిన్ సి, ఫైబర్ శరీరానికి హాని చేసే కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తాయి.
- జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తాయి.
- ఇందులో ఐరన్ ఉండడం వల్ల రక్తహీనత సమస్యతో బాధపడేవారికి మంచి ఔషధంగా పనిచేస్తాయి.
- ఈ పండ్లలో ఉండే కాపర్ వల్ల ఎర్ర రక్తకణాలు వృద్ధి చెందుతాయి.
- చిగుళ్ల నుంచి రక్తం కారడం, బ్యాక్టీరియ వంటి సమస్యలు తొలగిపోతాయి. దంతాలపై ఉండే ఎనామిల్ బలోపేతం అవుతుంది.
- ఇందులో రోగనిరోధక శక్తిని పెంచే బిటాకెరోటిన్ అనే పదార్థం ఉంటుంది.
- మామిడి పండ్లలో విటమిన్ సితోపాటు విటమిన్ ఎ, విటమిన్ బి6, విటమిన్ కె, ప్రోటీన్, ఫైబర్, ఫోలిక్ యాసిడ్, పొటాషియం ఉంటాయి. వీటి వల్ల ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు దరి చేరవు.




సితారతో మూడో ప్రాజెక్టు

డైరెక్టర్ వెంకీ అట్లూరి తన తదుపరి చిత్రాన్ని ప్రముఖ నిర్మాణసంస్థతో చేయనున్నారు. తాజా సమాచారం ప్రకారం ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్‌మెంట్స్ తమ 24వ చిత్రానికి వెంకీ అట్లూరి దర్శకత్వం వహించనున్నట్లు ప్రకటించింది. గతంలో 'రేంజ్', 'సార్' చిత్రాలకి దర్శకత్వం వహించిన వెంకీతో ఇది వారి మూడవ చిత్రం. నటీనటులు, సాంకేతిక నిపుణులు, ఇతర వివరాలు రానున్న రోజుల్లో ప్రకటించనున్నట్లు తెలిపింది.

'ఉస్తాద్ భగత్ సింగ్' పోస్టర్

దర్శకుడు హరీష్ శంకర్, హీరో పవన్ కళ్యాణ్‌తో ఒక సినిమా తీస్తున్నట్లు ప్రకటించారు. 'ఉస్తాద్ భగత్ సింగ్' టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పుడు పట్టాలెక్కింది. సినిమా ప్రకటించి నెలలు గడుస్తున్నా పవన్ డేట్స్ ఇవ్వలేదు. ఇప్పుడు దొరికాయి. దాంతో సినిమా సెట్స్ మీదకు వెళ్లింది. రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటుంది. ఈ సందర్భంగా మేకర్స్ పోస్టర్ విడుదల చేశారు. పవన్ పవర్ ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నాడు. అందుకు తగ్గట్టుగానే పోలీస్ స్టేషన్‌లో పవన్ ఒక చైర్‌లో కూర్చొని ఒక చేత్తో గన్‌ను, ఇంకో చేత్తో టీ గ్లాస్‌ను పట్టుకొని ఉన్న పవన్ భగత్ సింగ్ ఫోటోను చూస్తూ ఉన్న పోస్టర్‌ను రిలీజ్ చేశారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌లో రూపొందుతున్న ఈ చిత్రం కోలీవుడ్ చిత్రం 'తేరి' రీమేక్. తెలుగు నేటివిటీకి, ఫ్యాన్స్‌కు నచ్చినట్లు తీయనున్నట్లు సమాచారం.





'ఉగ్రం' ముగించేశారు..


విజయ్ కనకమేడలతో 'నాంది' తరువాత నరేష్ చేస్తున్న రెండవ చిత్రం 'ఉగ్రం'. ఇందులో నరేష్ పోలీస్ అధికారి పాత్ర చేస్తున్నారు. మలయాళ హీరోయిన్ మిర్నాలిని రవి కథానాయికగా నటిస్తున్న ఈ సినిమా వేసవి కానుకగా మే 5న విడుదలకానుంది. తాజా సమాచారం ప్రకారం గురువారంతో ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసినట్లు చిత్రబృందం ఒక పోస్టర్ ద్వారా ప్రకటించింది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహూ గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అబ్బూరి రవి మాటలు అందిస్తున్నారు.

పదేళ్ల తర్వాత జోడీగా..



తమిళ హీరో జై పుట్టిన రోజు సందర్భంగా జీ స్టూడియోస్ ఈరోజు ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. 'చూడగానే పక్కింటి అబ్బాయిలా కనిపించే హీరో జై.. లేడీ సూపర్‌స్టార్ నయనతారతో కలిసి చిత్రంలో నటించనున్నాడు' అని ప్రకటించింది. దీంతో నయనతార ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. పదేళ్ల క్రితం జై-నయనతార కలిసి నటించిన రాజా రాణి సినిమా సూపర్ హిట్ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరోసారి ఈ కాంబినేషన్ రిపీట్ అవుతుండడంతో తమిళ, తెలుగు ప్రేక్షకులు ఆనందంగా ఉన్నారు. ఇప్పుడు 'జవాన్' సినిమాలో కనిపించిన నయనతార తన 75వ చిత్రాన్ని కూడా త్వరలోనే ప్రారంభించనున్నారు.

'ఆదిపురుష్' హనుమాన్



ఓం రౌత్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'ఆదిపురుష్' నుండి చిత్రబృందం తాజా పోస్టర్ విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో రామ భక్తుడిగా ఉన్న హనుమాన్ పాత్రదారుడు రాముని జపిస్తూ ధ్యానంలో ఉండగా వెనుక రాముని పాత్రలో ప్రభాస్ కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో జానకిగా కృతిసనన్, రావణునిగా సైఫ్ అలీఖాన్, లక్ష్మణుడిగా సన్నీ నిజార్, హనుమంతుడిగా దేవదత్త నాగే నటిస్తున్నారు. 550 కోట్ల రూపాయల బడ్జెట్‌తో టి సిరీస్ బ్యానర్‌పై భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్, ఔంరౌత్, ప్రసాద్ సుతార్, రాజేశ్ నాయర్ నిర్మిస్తున్నారు. అజయ్-అతుల్ సంగీతం అందిస్తున్నారు.

'మిషన్' ట్రైలర్



కోలీవుడ్ హీరో అరుణ్ విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'మిషన్: చాప్టర్ 1'. విజయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎం.రాజశేఖర్, ఎస్.స్వాతి నిర్మించారు. ఈ చిత్రంలో అరుణ్ విజయ్ సరసన అమీ జాక్సన్ నటిస్తోంది. ఈ సినిమా టీజర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. లండన్‌లో పేరు మోసిన జైలు వాండ్స్ వర్త్. ఈ సినిమా మొత్తం ఈ జైలు బ్యాక్ డ్రాప్‌లో నడుస్తుందని అర్థమవుతుంది. అసలు హీరో అరుణ్ విజయ్ ఏ కారణాలతో తను వాండ్స్‌వర్త్ జైలుకి వెళ్లాడు. చివరకు జైలు నుంచి ఎలా బయటకు వచ్చాడు అనేది 'మిషన్' కథ. జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం సినిమాకు మెయిన్ హైలెట్‌గా నిలిచింది.

శివాలెత్తిన శార్దూల్

20బంతుల్లోనే అర్ధసెంచరీ
బెంగళూరుపై 81 పరుగుల తేడాతో కోల్‌కతా గెలుపు



కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో జరిగిన ఐపిఎల్ కోల్‌కతా నైట్ రైడర్స్ ఘన విజయం సాధించింది. తొలుత శార్దూల్ ఠాకూర్, రింకు సింగ్ బ్యాటింగ్‌లో మెరవడంతో కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 204పరుగుల భారీస్కోర్ నమోదు చేయగా.. ఛేదనలో బెంగళూరు జట్టు 17.4ఓవర్లలో 123పరుగులకే కుప్పకూలింది. దీంతో కోల్‌కతా జట్టు 81 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సీజన్-16లో బోణీ కొట్టింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతాకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(3), మన్‌దీప్(0), కెప్టెన్ నితీశ్ రాణా(1) ఘోరంగా విఫలమయ్యారు. దీంతో కోల్‌కతా జట్టు 47పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో మరో ఓపెనర్ గుర్బాజ్(57) అర్ధసెంచరీతో రాణించినా.. ఆండీ రస్సెల్(0) డకౌట్ కావడంతో కోల్‌కతా జట్టు 89పరుగులకే 5వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్రమంలో రింకు సింగ్(46)కి తోడు శార్దూల్ ఠాకూర్(68) అర్ధ శతకంతో చెలరేగారు. శార్దూల్ ఆకాశమే హద్దుగా బ్యాటింగ్‌లో మెరిసాడు. హర్షల్ పటేల్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టి అర్ధసెంచరీ పూర్తి చేశాడు. కేవలం 20 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసి ఈ ఐపిఎల్‌లో తక్కువ బంతుల్లో అర్ధసెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచాడు. 29బంతుల్లో ఎదుర్కొన్న శార్దూల్ 9ఫోర్లు, 3సిక్సర్ల సాయంతో 68పరుగులు చేసి జట్టు స్కోర్ 200కు పైగా సాధించేందుకు దోహదపడ్డాడు. శార్దూల్ క్రీజ్‌లోకి రావడంతో సీన్ మారింది. అతడు ధనాధన్ ఇన్నింగ్స్‌తో స్కోర్ వేగం పెంచాడు. శార్దూల్‌కు ఐపిఎల్‌లో ఇదే తొలి అర్ధసెంచరీ కాగా.. రింకూ, శార్దూల్ కలిసి ఆరో వికెట్‌కు 103 పరుగులు జత చేశారు. డేవిడ్ విల్లీ, కరణ్ శర్మకు రెండేసి, సిరాజ్, బ్రాస్‌వెల్, హర్షల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఛేదనలో బెంగళూరు ఓపెనర్లు కోహ్లి(21), కెప్టెన్ డుప్లెసిస్(23) మాత్రమే బ్యాటింగ్‌లో మెరిసారు. ఆ తర్వాత బెంగళూరు జట్టు వరుసగాను చేజార్చుకొంది. 96పరుగులకే 9వికెట్లు కోల్పోయింది. చివరి వికెట్‌కు డేవిడ్ విల్లీ(20), ఆకాశ్‌దీప్(17) కలిసి చివరి వికెట్‌కు 27పరుగులు జతచేశారు. వరుణ్ చక్రవర్తికి నాలుగు, సుయేశ్ శర్మకు మూడు, నరైన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ శార్దూల్ ఠాకూరుకు లభించింది.

దినేశ్ కార్తీక్ నిర్ణయం భేష్..

ఆర్‌సీబీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ అనుభవంలో మరోసారి మెరిశాడు. కేకేఆర్ కెప్టెన్ నితీశ్ రాణా రివర్స్‌స్వీప్‌కు యత్నించగా.. బంతి గ్లోవ్స్‌కు తాకి కీపర్ కార్తీక్ చేతుల్లో పడింది. అయితే బ్రాస్‌వెల్ ఎల్బీకి అప్పీల్ వెళ్దామంటే.. క్యాచ్ అప్పీల్ కోసం రివ్యూకు వెళ్లమని కెప్టెన్‌ను సూచించాడు. వెళ్లాడు. దినేశ్ నిర్ణయంతో నితీశ్ ఔటయ్యాడు.

పాయింట్ల పట్టిక

ఫ్రాంచైజీ	మ్యా	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	2	2	0	4	+0.70
పంజాబ్	2	2	0	4	+0.31
కోల్‌కతా	2	1	1	2	+2.05
రాజస్తాన్	2	1	1	2	+1.67
లక్నో	2	1	1	2	+0.95
చెన్నై	2	1	1	2	+0.03
బెంగళూరు	2	1	1	2	-1.25
ఢిల్లీ	2	0	2	0	-1.70
ముంబయి	1	0	1	0	-1.98
హైదరాబాద్	1	0	1	0	-3.60

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర: నెట్‌రన్‌రేట్

ఐపిఎల్‌లో నేడు..
లక్నో × హైదరాబాద్
(వేదిక: లక్నో; రా.7.30గం॥లకు)

సన్‌రైజర్స్ బోణీకొట్టేనా..?

మార్‌క్రమ్ ఇన్.. నేడు లక్నో సూపర్‌జెయింట్స్‌తో ఢీ



లక్నో: హైదరాబాద్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో ఓడిన సన్‌రైజర్స్ జట్టు లక్నో సూపర్ జెయింట్స్‌తో పోటీకి సిద్ధమైంది. ఈ క్రమంలో ఐపిఎల్-2023లో బోణీ కొట్టేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉవ్విళ్లూరుతుంది. లక్నోతో జరగబోయే ఈ పోరులో ఎస్‌ఆర్‌హెచ్ అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇవ్వాలని భావిస్తోంది. కాగా ఎస్‌ఆర్‌హెచ్ తమ తొలి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఘోర పరాజయం చవిచూసిన సంగతి తెలిసిందే. ఇక లక్నోతో మ్యాచ్‌కు కెప్టెన్ ఐడెన్ మార్‌క్రమ్ అందుబాటులో ఉండనున్నాడు. నెదర్లాండ్స్‌తో సిరీస్ కారణంగా తొలి మ్యాచ్‌కు దూరమైన మార్‌క్రమ్.. లక్నోతో మ్యాచ్‌లో మాత్రం తమ జట్టును ముందుండి నడిపించనున్నాడు. మార్‌క్రమ్ జట్టుతో కలవడం సన్‌రైజర్స్ పటిష్టంగా కన్పిస్తోంది. అయితే మార్‌క్రమ్ అందుబాటులోకి రావడంతో లక్నోతో మ్యాచ్‌కు హ్యారీ బ్రూక్‌ను ప్రక్కన పెట్టే అవకాశముంది. ఇక బౌలింగ్ విషయానికి వస్తే.. ఎస్‌ఆర్‌హెచ్ పేసర్లు తమ మార్క్‌ను చూపించడంలో విఫలమయ్యారు. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పేసర్లు దారుణ ప్రదర్శన కనబరిచారు. ఈ మ్యాచ్‌లో ఒక నటరాజన్ మినహా మిగితా అందరూ నిరాశపరిచారు. కానీ జట్టులో ఉమ్రాన్ మాలిక్, భువనేశ్వర్ కుమార్, ఫజల్హక్ ఫారూఖీ వంటి స్పీడ్ స్టార్లు ఉన్నారు. వీరు తమ స్థాయికి తగ్గట్టు ప్రదర్శన చేస్తే.. లక్నో బ్యాటర్లకు చుక్కలు కన్పించడం ఖాయం.

క్వార్టర్స్‌కు ప్రియాంశు

టాప్‌సీడ్ నిషిమోటోపై సంచలన విజయం



ఓర్లీన్స్(ఫ్రాన్స్) : ఓర్లీన్స్ మాస్టర్స్ సూపర్-300లో భారత యువ షట్లర్ ప్రియాంశు రాజవత్ సంచలనం సృష్టించాడు. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో ప్రియాంశు వరుససెట్లలో టాప్‌సీడ్, జపాన్‌కు చెందిన కెంటా నిషిమోటోపై సంచలన విజయం సాధించాడు. రెండోరౌండ్ పోటీలో ప్రియాంశు 21-8, 21-16తో కేవలం 42 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించాడు. దీంతో ప్రియాంశు కెరీర్‌లో తొలిసారి ఓ టాప్‌సీడ్ ఆటగాడిపై విజయం సాధించాడు. ప్రియాంశు తొలిగేమ్‌లో 10-0పాయింట్ల ఆధిక్యతలోకి దూసుకెళ్లి ప్రత్యర్థికి ఒక్క పాయింట్ కూడా గెలుచుకొనే అవకాశం ఇవ్వలేదు. ఇక రెండో గేమ్‌లో నిషిమోటో పోరాడినా ఏమాత్రం ఒత్తిడికి గురికాక మ్యాచ్‌ను ముగించాడు. క్వార్టర్‌ఫైనల్లో ఛి-యు-జాన్(చైనీస్ తైపీ)తో తలపడనున్నాడు. మరో మ్యాచ్‌లో మిథున్ మంజునాథ్ రెండోరౌండ్‌లో పోరాడి ఓడాడు. మిథున్ 22-24, 23-25పాయింట్ల తేడాతో ఛి-యు-జాన్(చైనీస్ తైపీ) చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. ఇక మహిళల సింగిల్స్‌లో తాన్యా హేమంత్ 8-21, 20-22తో నిడైరా(జపాన్) చేతిలో ఓడారు. పురుషుల డబుల్స్‌లో 7వ సీడ్ ఎంఆర్ అర్జున్-ధృవ్ కపిల జోడీ 21-13, 22-20తో పోలండ్ జోడీపై, మహిళల డబుల్స్‌లో తానీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప జోడీ కూడా రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68